PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

సిటీ

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 289 | విజయవాడ, సోమవారం 22 మే 2023 | 6 + 8 పేజీలు వెల : 5. 50

Vol No | Vijayawada, Monday 22 May 2023 | Rs



సంగీత దర్శకుడు
రాజ్ ఇకలేరు

● లోపలి పేజీలో.. ●

ప్లే ఆఫ్‌లోకి ముంబయి



● లోపలి పేజీలో.. ●



అన్నమయ్య జిల్లా రామాపురం మండలం కొత్తపల్లె గ్రామం వద్ద నేలకొరిగిన స్కీమ్ మోటార్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, స్తంభం

గాలివాన బీభత్సం

- రాయలసీమలో పంటలకు తీవ్ర నష్టం
- పలు చోట్ల విరిగిపడిన చెట్లు, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు
- రాకపోకలకు అంతరాయం

ప్రజాశక్తి- యంత్రాంగం

ఉపరితల ఆవర్తనం ప్రభావంతో రాయలసీమ జిల్లాల్లో ఆదివారం పలుచోట్ల గాలివాన బీభత్సం సృష్టించింది. ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురిశాయి. కొన్నిచోట్ల వడగళ్ల వాన పడింది. గాలుల తీవ్రతకు చెట్లు, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు విరిగిపడడంతో విద్యుత్ సరఫరాకు, రాకపోకలకు అంతరాయం కలిగింది. ఉద్యాన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. సత్యసాయి జిల్లా పరిగి మండలం రంగరాజుపల్లి సమీపంలో కాలువపల్లికి చెందిన బాలు అనే వ్యక్తి ఇటుకల బట్టి వద్ద వేసిన రేకుల షెడ్డు ఈదురుగాలుల తీవ్రతకు కూలిపోయింది. హిందూపురం పట్టణంలోని అంబేద్కర్ నగర్‌లో గాలివానకు విద్యుత్ స్తంభం విరిగిపడింది. చెట్లు కూలిపోయాయి. పలుచోట్ల ఫ్లెక్సీలు ఎగిరిపోయాయి. నంద్యాల జిల్లా అవుకు మండలం కునుకుంట్ల గ్రామంలోని ఎస్‌సి కాలనీలోని రైతు లక్షుమ్‌పల్లె పుల్లన్న ఇంటి సమీపంలోని కొబ్బరి చెట్టుపై పిడుగుపడింది. దీంతో, దీని పక్కన ఉన్న గడ్డివామి దగ్ధమైంది. ఆత్మకూరు పట్టణంలోనూ, మండలంలోని పలు గ్రామాల్లోనూ వడగండ్లతో కూడిన భారీ వర్షం దాదాపు గంటపాటు కురిసింది. ఆత్మకూరులోని పలు కాలనీల్లో రోడ్లపై వర్షపు నీరు నిల్చిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఆళ్లగడ్డ మండలం అహోబిలంలో వడగళ్లలో కూడిన వర్షం కురిసింది. ఈదురుగాలులతో కూడిన వర్షానికి చిత్తూరు జిల్లా సదుం మండలంలోని పలు ప్రాంతాల్లో మామిడి, బొప్పాయి, టమాట, బంతిపూల పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. దీంతో, లక్షలాది రూపాయల నష్టం వాటిల్లిందని రైతులు వాపోయారు. చెట్టు పడడంతో గాండ్లపల్లెలోని ఎంపియుపి పాఠశాల ప్రహరీ పాక్షికంగా దెబ్బతింది. కురవపల్లెలో రెండు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. తిరుపతి జిల్లాలో అక్కడక్కడా చెట్లు పడిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కొన్నిచోట్ల రవాణాకు అంతరాయం కలిగింది.

అన్నమయ్య జిల్లా గాలివీడు, రామాపురం, కలికిరి, నిమ్మనపల్లి, లక్కిరెడ్డిపల్లె తదితర మండలాల్లో గాలి వానకు అక్కడక్కడా చెట్లు విరిగి పడ్డాయి. విద్యుత్ స్తంభాలు మిగతా 2లో

ఐటి ఉద్యోగి సహా ముగ్గురు మృతి

చిన్నారికి తీవ్ర గాయాలు

● లోపలి పేజీలో.. ●

రూ.2 వేల నోట్ల మార్పిడికి ఎలాంటి పత్రాలూ అవసరం లేదు : ఎస్‌బిఐ

న్యూఢిల్లీ : రూ.2,000 నోట్లను మార్చుకునే క్రమంలో ఎలాంటి పత్రాలు సమర్పించాల్సిన అవసరం లేదని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) స్పష్టం చేసింది. రూ.20 వేల వరకు బ్యాంకులో నేరుగా మార్చుకోవచ్చని సూచించింది. ఎలాంటి ఐడి ప్రూఫ్ కూడా ఇవ్వాల్సిన అవసరం లేదని పేర్కొంది. నోట్ల మార్పిడి సమయంలో అభ్యర్థన పత్రం సమర్పించాలని, ఆధార్ కార్డ్ లేదా ఇతర గుర్తింపు కార్డులు ప్రూఫ్‌గా ఇవ్వాల్సి వుంటుందని సోషల్ మీడియాలో వస్తున్న వార్తలను ఎస్‌బిఐ కొట్టిపారేసింది. చలామణి నుంచి రూ.2 వేల నోటును ఉపసంహరిస్తున్నట్లు శుక్రవారం ఆర్‌బిఐ ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈనెల 23 నుంచి సెప్టెంబరు 30వ తేదీలోపు బ్యాంకు ఖాతాల్లో జమ చేసుకోవచ్చని, ఇతర నోట్లలోకి మార్చుకోవచ్చని వెల్లడించింది.



ఒక్క బస్సూ కొనరేం?


- నాలుగేళ్లుగా కాలం చెల్లిన బస్సులతో కాలయాపన

● లోపలి పేజీలో.. ●

ఉసూరుమంటోన్న యువత

ఉద్యోగాలూ లేవు.. ఉపాధి కల్పనా లేదు

- ఉన్నత చదువులున్నా.. వేధిస్తున్న నైపుణ్యాల కొరత
- నిరుద్యోగం యేటికేడూ విస్తరిస్తున్నా పట్టించుకోని మోడీ సర్కార్



న్యూఢిల్లీ : దేశంలో నిరుద్యోగం కోరలు చాచి అంతకంతకూ విస్తరిస్తోంది. ఉన్నత విద్యార్హతలు ఉన్నా..చేయ గలిగిన చేవ ఉన్నా దేశ యువతరం ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లేకపోవడంతో ఉసూరుమంటోంది. 2021 జులై చివరి నాటికి నిరుద్యోగం రేటు 6.95 శాతానికి పెరిగింది. ఇది పట్టణ ప్రాంతాల్లో 8.3 శాతంగా, గ్రామీణ ప్రాంతాల్లో 6.4 శాతంగా ఉన్నది. ఇక కోర్ సెక్టార్లలోనూ ఇవే పరిస్థితులు ఉన్నాయి. తయారీ, మైనింగ్‌లో ఉద్యోగాలు గణనీయంగా తగ్గిపోతున్నాయి. అయితే, దేశ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు చూపెట్టటం, అందుకు అవసరమైన నైపుణ్యాలను కల్పించటం వంటివి చేయాల్సిన మోడీ సర్కారు.. ఈ విషయంలోనూ జనాభా పెరుగుదలను సాకుగా చూపి, ఒక సామాజిక తరగతిని అందుకు కారణంగా చూపుతూ.. వారిపై విద్వేషాలు పెంచే ప్రయత్నాలు చేయటం దేశ భవిష్యత్తుకు ఏ మాత్రమూ శ్రేయస్కరం కాదని మేధావులు, సామాజికవేత్తలు తెలిపారు. దేశ జనాభాలో 62 శాతం కంటే ఎక్కువ మంది 15 నుంచి 59 సంవత్సరాల వయస్సు గలవారున్నారు. అంటే, పని చేసే వయస్సున్నవారు దాదాపు 54 శాతం మంది 25 ఏళ్ల లోపు వారే. రాబోయే దశాబ్దంలో 15-59 సంవత్సరాల వయస్సున్నవారి జనాభా పెరుగుతుందని ఒక అంచనా. అయితే, దేశంలోని ప్రజలకు ఉద్యోగాలు, ఉపాధి, నైపుణ్యాల కల్పన విషయంలో మోడీ సర్కారు విఫలమైందనీ, ఈ విషయంలో పొరుగు దేశం చైనా చక్కటి ప్రదర్శననున కనబరుస్తున్నదని నిపుణులు విశ్లేషించారు. శ్రామిక శక్తిలో నైపుణ్యం లేకుంటే అంచనాలలో పేర్కొన్నవిధంగా దేశ శ్రామిక శక్తిలో 32 శాతం పెరుగుదల ఏమీ ఉండదని తెలిపారు. పైగా తగిన పని దొరకక వారు నిరుద్యోగులుగా మారుతారని హెచ్చరించారు.

నైపుణ్య శిక్షణ కరవు

గత దశాబ్ద కాలంగా పని ప్రపంచం వేగంగా మారుతోంది. కోవిడ్-19 మహమ్మారి మార్పుల వేగాన్ని మరింత వేగవంతం చేసింది. వేగంగా మారుతున్న ఈ పని ప్రపంచం పూర్తిగా భిన్నమైన నైపుణ్యాలను కోరుతున్నదని నిపుణులు తెలిపారు. ప్రపంచంలోని ఇతర ప్రాంతాలతో పోలిస్తే భారత్ భారీ జనాభా ప్రయోజనాన్ని అనుభవిస్తున్నప్పటికీ, దేశ శ్రామిక శక్తి నైపుణ్యాలు, శిక్షణలో నిరాశాజనకంగా వెనుకబడి ఉన్నదని ఆందోళన వ్యక్తం చేశారు. మన శ్రామిక శక్తిలో కేవలం 5 శాతంమంది మాత్రమే ఏదైనా అధికారిక నైపుణ్య శిక్షణ పొందారు. ఇది యూకేలో 68 శాతం, జర్మనీలో 75 శాతం, యూఎస్‌లో 52 శాతం, జపాన్‌లో 80 శాతం, దక్షిణ కొరియాలో 96 శాతంగా ఉండటం గమనార్హం.

ఇక ప్రభుత్వ స్వంత అంచనాలను పరిశీలిస్తే.. 2022 నాటికి, మౌలికరంగంలో దాదాపు 1.5 కోట్ల మంది నైపుణ్యం కలిగిన కార్మికుల కొరత ఉంటుంది. ఆటో కాంపోనెంట్స్ విభాగంలో 3.5 కోట్ల మంది, భవనం మరియు నిర్మాణంలో 3.3 కోట్ల మంది, దుస్తులు మరియు వస్త్రాలలో రంగంలో 2.6 కోట్ల మంది కొరత ఉంటుంది. అలాగే, రవాణా మరియు లాజిస్టిక్స్‌లో దాదాపు 1.8 కోట్ల మంది నైపుణ్యం కలిగిన కార్మికుల కొరత ఉంటుంది. వ్యవస్థీకత రిటైల్‌లో మరో 1.7 కోట్లుగా ఉండనున్నది. రియల్ ఎస్టేట్ సేవల్లో దాదాపు 1.4 కోట్ల మంది, ఆరోగ్య సంరక్షణలో సుమారు 1.3 కోట్ల మంది, ఫుడ్ ప్రాసెసింగ్‌లో ఒక కోటి మంది, విద్యలో 60 లక్షల మంది కొరత ఉంటుంది. ఇది దేశంలో నైపుణ్యం లేని కార్మికుల కొరత తీవ్రతకు అద్దం పడుతున్నదని విశ్లేషకులు చెబుతున్నారు. ఫలితంగా వారంతా నిరుద్యోగులుగానే మిగిలే ప్రమాదమున్నదని హెచ్చరిస్తున్నారు. అయితే, దేశ యువత, శ్రామికులకు నైపుణ్యాభివృద్ధి మిగతా 5లో

కేరళలో తగ్గిన నిరుద్యోగం

- 12 శాతం నుంచి 5 శాతానికి పడిపోయిన తీరు
- ఎల్‌డిఎఫ్ ప్రభుత్వ ఘనత
- రెండేళ్ల పాలనపై 'ప్రగతి నివేదిక'

● లోపలి పేజీలో.. ●

ఆస్ట్రేలియా పార్లమెంటు హౌస్‌లో 24న 'మోడీ' బిబిసి డాక్యుమెంటరీ

కాన్‌బెర్రా : బిబిసిలో రెండు భాగాలుగా ప్రసారమైన 'ఇండియా : ది మోడీ క్వశ్చన్' డాక్యుమెంటరీని ఆస్ట్రేలియా పార్లమెంటు హౌస్‌లో ఈ నెల 24న ప్రదర్శించనున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సోమవారం నుంచి మూడు రోజుల పాటు ఆస్ట్రేలియాలో పర్యటించనున్న సంగతి తెలిసిందే. ఈ డాక్యుమెంటరీని భారత్‌లో ప్రదర్శించనీయకుండా మోడీ సర్కార్ అడ్డుకుంది. ఆస్ట్రేలియాలోనూ దీనిని అడ్డుకోవడానికి దౌత్య వర్గాల ద్వారా యత్నాలు జరుగుతున్నాయి. పార్లమెంట్ హౌస్‌లో ఈ డాక్యుమెంటరీని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్, హిందూస్ ఫర్ హ్యూమన్ రైట్స్ ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, ముస్లిం కలెక్టివ్ వంటి సంస్థలు సంయుక్తంగా ప్రదర్శించాలని నిర్ణయించాయి. దీనికి మద్దతుగా 'పెరియార్-అంబేద్కర్ థాట్ సర్కిల్-ఆస్ట్రేలియా,' 'ది హ్యూమనిజం ప్రాజెక్టు', 'ది సెంటర్ ఫర్ కల్చర్ సెంటర్డ్ అప్రోచ్ టు రీసెర్చి అండ్ ఎవాల్యుయేషన్ సంస్థలు పాల్గొననున్నాయి.. గుజరాత్ 2002 అల్లర్లకు అప్పటి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న మోడీనే కారణమని బిబిసి డాక్యుమెంటరీ ఆధారాలతో సహా వెల్లడించింది. మోడీ ప్రధాని బాధ్యతలు స్వీకరించిన 2014 నుంచి మైనార్టీలపై సంఘ్‌పరివార్ మూకల దాడులు పెరిగిపోతున్న తీరును చర్చించింది.

జిసిసి వయా బిగ్ బాస్కెట్

- అటవీ ఉత్పత్తుల అమ్మకానికి కార్పొరేట్‌తో జోడీ
- హాస్టళ్లకు చింతపండు, కారం, పసుపు సరఫరాకు ప్రణాళిక

ప్రజాశక్తి- అనకాపల్లి ప్రతినిధి

గిరిజనుల నుంచి గిరిజన సహకార సంస్థ (జిసిసి) సేకరిస్తోన్న అటవీ ఉత్పత్తులు, పంటల అమ్మకానికి కార్పొరేట్ సంస్థ అయిన బిగ్ బాస్కెట్‌తో జోడీ కట్టనుంది. ఇందుకు సంబంధించి ప్రణాళికలు రూపొందించింది. ప్రభుత్వ వసతి గృహాలకు చింతపండు, కారం, పసుపు సొంతంగా సరఫరా చేసేందుకు సిద్ధమవుతోంది. వ్యాపారాభివృద్ధికి కొత్త మార్గాలను అన్వేషిస్తోంది. తద్వారా తన ఆర్థిక పరిస్థితి మెరుగుపర్చుకోవాలని భావిస్తోంది. ఏజెన్సీ ప్రాంతంలోని అటవీ ఉత్పత్తులు, ఆర్గానిక్ పంటలకు బహిరంగ మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. దీంతో, వీటి సేకరణ పెంచే దిశగా జిసిసి అడుగులు వేస్తోంది. ఈ సంస్థకు మార్కెటింగ్ నెట్ వర్క్ పరిమితంగా ఉంది. దీంతో, 'బిగ్ బాస్కెట్' సంస్థ ద్వారా ఉత్పత్తులను వినియోగదారుల దగ్గరకు తీసుకెళ్లాలని యోచిస్తోంది. దీనివల్ల అమ్మకాలు పెరుగుతాయని, లాభాలు వస్తాయని భావిస్తోంది. ఇది విజయవంతం అయితే అటవీ, గిరిజన ఉత్పత్తులు ఎక్కువ మొత్తంలో సేకరించాలని అనుకుంటోంది. డిమాండ్‌కు అనుగుణంగా ముందుకు సాగాలని చూస్తోంది. రాష్ట్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలు, బిసి, ఎస్‌సి వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలలకు నేరుగా కారం, పసుపు, చింతపండు సరఫరాకు సిద్ధమవుతోంది. ఇందుకు సంబంధించి ప్రభుత్వంతో వివిధ దశల్లో చర్చలు జరిగాయి. సానుకూల స్పందన ఇస్తుందనే నమ్మకంతో జిసిసి ఉంది. గిరిజన సంక్షేమ హాస్టళ్లకు కాస్మోటిక్స్ పంపిణీ బాధ్యతను ఇప్పటికే జిసిసికి ప్రభుత్వం అప్పగించింది. జూన్ నుంచి కాస్మోటిక్స్ పంపిణీ చేయనుంది. ఇందుకు సంబంధించి జిఒ కొద్ది రోజుల్లో రానున్నట్లు సమాచారం. దీనివల్ల జిసిసి సబ్బుల విక్రయం పెరగనుంది. ఇప్పటికే తిరుమల తిరుపతి దేవస్థానానికి తేనె, పసుపు సరఫరా చేస్తోంది.



జిసిసి కార్యాలయం

అమ్మకాలు పెంచనున్నాం



ప్రభుత్వ వసతి గృహాలకు పసుపు, కారం, చింతపండు సరఫరా చేస్తామని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. ఇందుకు అనుమతి ఇస్తూ త్వరలో జిఒ రానుంది. ఈ దృష్ట్యా అటవీ, గిరిజన ఉత్పత్తుల సేకరణ పెంచనున్నాం. మరోవైపు బిగ్ బాస్కెట్ సంస్థ ద్వారా అటవీ ఉత్పత్తుల అమ్మకాలు పెంచాలని ప్రయత్నిస్తున్నాం. వీటివల్ల గిరిజనులకు మేలు జరగనుంది.

-జి.సురేష్‌కుమార్, జిసిసి ఎమ్‌డి

బాలికపై లైంగిక దాడి

ఓ జులాయి ఘాతుకం

ప్రజాశక్తి- తెనాలి (గుంటూరు జిల్లా)

అభం శుభం తెలియని బాలికపై ఓ జులాయి కన్ను పడింది. మాయమాటలు చెప్పి నమ్మకంగా తీసుకెళ్లి లైంగిక దాడి చేశాడు. బోరున విలపిస్తూ ఈ అఘాయిత్యాన్ని బాలిక తన తల్లికి చెప్పడంతో ఆమె పోలీసులను ఫిర్యాదు చేశారు. పోలీసులకు అందిన ఫిర్యాదు ప్రకారం... గుంటూరు జిల్లా తెనాలిలోని వైకుంఠపురం కాల్వకట్టకు ఆనుకుని పోతురాజు కాలనీ ఉంది.

ఆ కాలనీలో కొప్పుల రాజు (44) జులాయిగా తిరుగుతుంటాడు. శనివారం రాత్రి అదే ప్రాంతానికి చెందిన బాలిక షాపు వద్దకు వెళుండగా రాజు అడ్డగించాడు. తనకు కూడా ఓ కూల్‌డ్రింక్ తెచ్చి ఇవ్వాలని బాలికను కోరాడు. రాజు ఆంతర్యం పసిగట్టలేని ఆ బాలిక కూల్‌డ్రింక్ తీసుకొచ్చి అతనికి ఇచ్చింది. ఇదే అదనుగా భావించిన రాజు ఆ బాలికకు మాయమాటలు చెప్పాడు. సమీపంలోని ఓ ఇంట్లోకి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. అర్ధరాత్రి వరకూ నిర్బంధించి, ఎవ్వరికీ చెప్పొద్దంటూ భయపెట్టి విడిచిపెట్టాడు. బాలిక బోరున విలపిస్తూ ఇంటికి వచ్చి తల్లికి విషయం చెప్పింది. అప్పటికే బాలిక కోసం తల్లితోపాటు స్థానిక మహిళలు వెతుకుతున్నారు. వారంతా పెద్ద ఎత్తున గుమికూడారు. జరిగిన ఘోరంపై బాలిక తల్లి పట్టణ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని విచారణ చేపట్టారు.

బాలికను వైద్య పరీక్షల నిమిత్తం వైద్యశాలకు తరలించామని, నిందితుని కోసం గాలిస్తున్నామని సిఐ కె.చంద్ర శేఖరరావు తెలిపారు. కేసు విచారణాధికారిగా డిఎస్‌పి బి.జనార్ధన్‌రావు వ్యవహరిస్తున్నారు. వృద్ధులు, వితంతువులు, చిన్నారులే లక్ష్యంగా నిందితుడు దురాగతాలకు పాల్పడుతున్నాడని స్థానిక మహిళలు చెబుతున్నారు. గతంలో కాలనీ మహిళలంతా కలిసి రాజుపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా కఠిన చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంత మహిళలు కోరుతున్నారు.

ఎల్‌ఐసిని కార్పొరేట్లకు దోచిపెడితే ఊరుకోం

- ఎల్‌ఐసి ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా జాతీయ ప్రధాన కార్యదర్శి దిలీప్

ప్రజాశక్తి- కలెక్టరేట్ (విశాఖపట్నం)

లాభాల్లో ఉన్న ఎల్‌ఐసిని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఎఫ్‌డిఐ, ఐపిఒ పేరుతో నిర్వీర్యం చేసి కారు చౌకగా అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ సంస్థలకు దోచిపెట్టడానికి చేస్తోన్న ప్రయత్నాలను విరమించాలని ఎల్‌ఐసి ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా (ఎల్‌ఐసి ఎఒఐ) జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ డి.జి.దిలీప్ డిమాండ్ చేశారు. లేకుంటే ఎల్‌ఐసి ఉద్యోగులు, ప్రజలతో కలిసి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఎల్‌ఐసి ఎఒఐ ఐదో సౌత్ జోనల్ (ఎపి, తెలంగాణ, కర్నాటక) మహాసభ ఆదివారం విశాఖపట్నంలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఎల్‌ఐసిని ప్రయివేటీకరిస్తే సంస్థ, పాలసీదారుల ప్రయోజనాలు, ప్రజల నమ్మకాలు, వేలాది మంది ఉద్యోగస్తులు, లక్షలాది మంది ఏజెంట్ల భవిష్యత్తు ప్రశ్నార్థకమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. 1956లో కేవలం రూ.5 వేల కోట్లతో ప్రారంభించబడిన ఎల్‌ఐసి ప్రస్తుతం రూ.42 లక్షల కోట్ల మూలధనంతో, 30 కోట్ల పాలసీదారులతో, 99.7 శాతం క్లయిములు పరిష్కారం చేస్తూ ప్రపంచంలోనే అగ్రగామి సంస్థగా గుర్తింపు తెచ్చుకుందని తెలిపారు. దేశ స్వావలంబనకు, అభివృద్ధికి ఎంతగానో తోడ్పాటు అందిస్తున్న ఏకైక సంస్థగా ఎల్‌ఐసి పేరొందిందన్నారు. దేశ ప్రజల ప్రయోజనాల కన్నా, కార్పొరేట్ ప్రయోజనాలే అత్యంత ముఖ్యమని భావించి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఒక్కొక్క ప్రభుత్వ రంగ సంస్థనూ కార్పొరేట్లకు కారుచౌకగా కట్టబెడుతోందని విమర్శించారు. దేశంలో కోట్లాదిమంది నిరుద్యోగులు ఉన్నారని, వారికి ఉద్యోగావకాశాలు కల్పించలేని కేంద్ర ప్రభుత్వం ఎల్‌ఐసిలో పనిచేస్తున్న వేలాది మంది ఉపాధిని దెబ్బతీసే విధంగా ఐపిఒను తెరపైకి తేవడం దుర్మార్గమన్నారు. ఈ చర్యలను ఐక్య పోరాటాలతో అడ్డుకుంటామని స్పష్టం చేశారు. సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ఎల్‌ఐసి ఎదుగుదలలో ఏజెంట్ల శ్రమ ఎంతో ఉందన్నారు. అటువంటి సంస్థపై అదానీ, అంబానీల కన్నుపడిందని, ఐపిఒ పేరుతో తేలికగా స్వాహా చేయాలని చూస్తున్నారని తెలిపారు. కార్పొరేట్లకు దేశాన్ని తాకట్టుపెట్టే విధానం మంచిది కాదన్నారు. దేశానికి తాను వాచ్‌మ్యాన్‌నని చెప్పిన మోడీ... గేటు వద్ద కాపలా ఉండి దోమలను అడ్డుకొని, వెనుక నుంచి ఏనుగులను వదిలేస్తున్నారని దుయ్యబట్టారు. లేబర్ కోడ్స్‌ను అమల్లోకి తెచ్చి కార్మికుల హక్కులను కాలరాస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఎలక్ట్రిసిటీ మిగతా 2లో



మహాసభలో మాట్లాడుతున్న దిలీప్, వేదికపై ఉమామహేశ్వరరావు తదితరులు

ప్రీపెయిడ్ మీటర్లు ఉపసంహరించుకోవాలి

- సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

స్మార్ట్ ప్రీపెయిడ్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలని సిపిఎం రాష్ట్రకమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికే వ్యవసాయ పంప్‌సెట్లకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించిన ప్రభుత్వం ఇప్పుడు గృహ వినియోగ కనెక్షన్లకు స్మార్ట్ ప్రీపెయిడ్ మీటర్లు బిగించడానికి పూనుకోవడం గర్హనీయమని పేర్కొన్నారు. దీనివల్ల ప్రజలపై అదనపు భారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఈ ప్రయత్నాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. వినియోగదార్ల నుండి ముక్కుపిండి విద్యుత్ ఛార్జీలు వసూలు చేయడానికి, అదనపులోడ్, పీక్ డిమాండ్ పేరిట దొడ్డిదారిన వడ్డించడానికి అన్ని కనెక్షన్లకూ స్మార్ట్ ప్రీపెయిడ్ మీటర్లు బిగించాలన్న కేంద్రప్రభుత్వ ఆదేశం మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఇటువంటి చర్యకు పాల్పడడం తగదని పేర్కొన్నారు. నెలకు 200 యూనిట్లు పైబడి వాడే గృహ వినియోగ కనెక్షన్లకు తొలి దశలోనూ, మిగతా వారికి రెండో దశలోనూ ప్రీపెయిడ్ మీటర్లు బిగించనున్నట్లు, అందుకు అదానీ కంపెనీకి టెండర్ ఖరారు కానున్నట్లు వార్తలొస్తున్నాయని తెలిపారు. వినియోగదార్ల జేబుకు చిల్లు పెట్టి అదానికి కట్టబెట్టే యోచన ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ ప్రీపెయిడ్ మీటర్ల ఏర్పాటు నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే ప్రజల నుండి ప్రతిఘటన ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు.

బాలికపై సైకో దాడి

- ప్రాణాపాయ స్థితిలో బాధితురాలు
- సైకోను కొట్టి చంపిన గ్రామస్తులు

● లోపలి పేజీలో.. ●

సిబిఐ విచారణకు మరో'సారీ'

- పది రోజులు గడువు కోరుతూ అవినాష్‌రెడ్డి లేఖ

ప్రజాశక్తి- కడపప్రతినిధి

మాజీ మంత్రి వైఎస్ వివేకా హత్య కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న కడప ఎంపి వైఎస్ అవినాష్‌రెడ్డి సిబిఐ విచారణకు సోమవారం హాజరుకాలేనని తెలిపారు. ఈ మేరకు ఆయన సిబిఐకి ఆదివారం రాసిన లేఖలో తన తల్లికి ఆరోగ్యం కుదుటపడని నేపథ్యంలో మరో పది రోజులు గడువు కావాలని కోరారు. ఈ నెల 16న విచారణకు రావాలని అవినాష్‌రెడ్డిని సిబిఐ ఆదేశించింది. ముందుగా నిర్ణయించిన తన షెడ్యూల్ కారణంగా విచారణకు హాజరుకాలేనని పేర్కొన్నారు. దీనికి స్పందించిన సిబిఐ ఈ నెల 19న విచారణకు రావాలని నోటీసులు జారీ చేసింది. ఈ మేరకు విచారణకు వెళ్తున్న సమయంలో పులివెందులలో ఆయన తల్లి అనారోగ్యానికి గురవ్వడంతో ఆమెను వైద్య చికిత్స కోసం కర్నూలుకు తరలించారు. విషయం తెలుసుకున్న అవినాష్‌రెడ్డి నేరుగా హైదరాబాద్ నుంచి పులివెందులకు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ నెల 22న విచారణకు హాజరు కావాలని వాట్సప్ ద్వారా సిబిఐ నోటీసులు జారీ చేసింది. దీనికి ఆయన స్పందిస్తూ తన తల్లి ఆరోగ్యం కుదుటపడని నేపథ్యంలో మరో పది రోజులు గడువు కావాలని కోరుతూ లేఖ రాయడం చర్చనీయాంశంగా మారింది.

తిరుమలలో మద్యం కలకలం

ప్రజాశక్తి - తిరుమల:
తిరుమలలో మరోసారి మద్యం సీసాలు కలకలం రేపాయి. తాజాగా హెచ్‌టి కాంప్లెక్స్‌లోని షాప్ నెం.78లో ఆదివారం మద్యం లభ్యమైంది. విజిలెన్స్ తనిఖీల్లో ఐదు మద్యం సీసాలను అధికారులు స్వాధీనం చేసుకుని షాప్‌ను సీజ్ చేశారు. గతంలో 2019లో ఓ హాకర్ తిరుమలకు మద్యం బాటిల్ తెచ్చుకొని బహిరంగంగా తాగడంతో పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఏడాది మార్చి 24న పోలీసులు గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఇప్పుడు ఇలా మద్యం బాటిళ్లు లభ్యమయ్యాయి. తిరుమలలో మద్యం, గంజాయి విక్రయాలపై శ్రీవారి సందర్శకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పవిత్రమైన కొండపై ఇలాంటి అక్రమాలు పునరావృతం కాకుండా అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు. తిరుమల పవిత్రను కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని.. అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.
94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

ఎన్‌టిఆర్ స్ఫూర్తి కార్యక్రమాలు కొనసాగించాలి

- శతజయంతి కమిటీకి చంద్రబాబు సూచన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
ఎన్‌టిఆర్ స్ఫూర్తి కార్యక్రమాల్ని నిరంతరంగా కొనసాగించాలని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఎన్టీఆర్ లిటరేచర్, సావనీర్, వెబ్‌సైట్ కమిటీకి సూచించారు. ఎన్‌టిఆర్ శతజయంతి వేడుక సభను హైదరాబాద్‌లో విజయవంతంగా నిర్వహించినందుకు కమిటీని హైదరాబాద్‌లోని తన నివాసంలో ఆదివారం అభినందించారు. ఎన్‌టిఆర్‌పై వెలువరించిన గ్రంథాలను ఇంగ్లీష్, హిందీ భాషల్లోకి అనువదించి జాతీయస్థాయిలో ఎన్‌టిఆర్ భావజాలాన్ని, ఆయన సాధించిన విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కమిటీ ఛైర్మన్ టిడి జనార్ధన్‌కు చెప్పారు. ఎన్‌టిఆర్ వల్లే ప్రపంచవ్యాప్తంగా తెలుగువారికి గుర్తింపు లభించిందన్నారు. చంద్రబాబును కలిసిన వారిలో కమిటీ సభ్యులు కాట్రగడ్డ ప్రసాద్, రావుల చంద్రశేఖర రెడ్డి, కంఠంనేని రవిశంకర్, అట్లూరి నారాయణరావు, విక్రమ్ పూల, అశ్విన్, మధుసూదనరాజు, సతీష్ మండవ, శ్రీపతి సతీష్, కాసననేని రఘు, డి రామ్మోహన రావు పాల్గొన్నారు.

మొక్కజొన్న రైతు గోడు పట్టదా?

- టిడిపి ఎమ్మెల్యే అనగాని

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
మొక్కజొన్న రైతు గోడు సిఎం జగన్‌కు పట్టదా? అని టిడిపి ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ ప్రశ్నించారు. ఈ పంటను కొనుగోలు చేయలేని ముఖ్యమంత్రి మూడు రాజధానులు కడతానంటే జనం విశ్వసిస్తారా అని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నాలుగేళ్లుగా రైతులు ఏ పంట సాగు చేసినా నష్టాలే తప్ప లాభాల మాట వినిపించటం లేదని పేర్కొన్నారు. అకాల వర్షాలు, ఈదురుగాలులతో దెబ్బతిన్న పంటను కొనుగోలు చేసి ఆదుకుంటామని జగన్ ప్రభుత్వం ప్రచారార్భాటం చేసిందని పేర్కొన్నారు. పంట అమ్మాలనుకుంటున్న వారంతా ఆర్‌బికెల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మెలికపెట్టారని తెలిపారు. రైతుకు ఎంత పొలమున్నా ఐదెకరాల పంట కొనుగోలుకే రిజిస్ట్రేషన్ చేయడమేంటని ప్రశ్నించారు. మిగిలిన పంటను పారబోసుకోవాలా అని ప్రశ్నించారు.

దళితులపై పెరిగిన దాడులు

- టిడిపి రౌండ్‌టేబుల్ సమావేశంలో దళిత సంఘాల నాయకుల ఆందోళన


రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న మాల్యాద్రి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
రాష్ట్రంలో వైసిపి పాలనలో దళితులపై దాడులు పెరిగాయని టిడిపి నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో పలు దళిత సంఘాల నాయకులు అన్నారు. నాలుగేళ్లల్లో ఎనిమిది వేల మంది ఎస్సీలపై దాడులు జరిగాయని పేర్కొన్నారు. జగన్ పాలన నుంచి రాష్ట్రాన్ని విముక్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. 'జగన్ పాలనలో దళితులపై దాడులు-ప్రభుత్వ వైఫల్యాలు' అనే అంశంపై టిడిపి పొలిట్ బ్యూరోసభ్యులు వర్ల రామయ్య అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం విజయవాడలో ఆదివారం జరిగింది. జస్టిస్ రామకృష్ణ ప్రారంభోపన్యాసం చేసిన ఈ కార్యక్రమంలో మాజీమంత్రి నక్కా ఆనంద్‌బాబు, కెవిపిఎస్ ప్రధాన కార్యదర్శి అంద్ర మాల్యాద్రి, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షులు మందకృష్ణ మాదిగ, దళిత సంఘాల నాయకులు కొలికపూడి శ్రీనివాసరావు, రామకృష్ణ, బాలకోటయ్య తదితరులు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా నక్కా ఆనంద్‌బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో దళితులకు రాజ్యాంగబద్ధంగా అమలవుతున్న హక్కులు హరించబడుతున్నాయని విమర్శించారు. వీటిపై అధికార పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు మాట్లాడటం లేదన్నారు. శిరోముండనం వంటి ఘటనలు గతంలో అరుదుగా జరిగేవని, జగన్ పుణ్యమా అని ఇప్పుడు ఇవి నిత్యకృత్యమయ్యాయని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్నారని అన్నారు.

మంద కృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దారుణాలు కలవరపెడుతున్నాయని అన్నారు. దళితులు హత్యకు గురవుతున్నా కేసులు నమోదు కావడం లేదని చెప్పారు. ఎస్సీలపైనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెడుతున్నారని పేర్కొన్నారు. దళితుల రక్షణ కోసం జగన్ ప్రభుత్వాన్ని గద్దె దించాలని ఆయన అన్నారు. ఎస్సీ నియోజక వర్గాల్లో మాల, మాదిగ, రెల్లి కులాలకు సమానంగా సీట్లు ఇవ్వాలని కోరారు.

కెవిపిఎస్ ప్రధాన కార్యదర్శి అంద్ర మాల్యాద్రి మాట్లాడుతూ దళితులపై దాడులు రాష్ట్రంలో కంటే బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఎక్కువగా జరుగుతున్నాయని చెప్పారు. రిజర్వేషన్లు రద్దు చేయాలంటూ ఆర్‌ఎస్‌ఎస్‌తో పాటు కేంద్రంలోని బిజెపి నేతలు మాట్లాడుతున్నారని తెలిపారు. టిడిపి ఈ అంశంపై కూడా స్పందించాలని కోరారు. డిఎస్‌సి-1998 అభ్యర్థులకు ఇచ్చిన పోస్టింగులలో ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు వైసిపి ప్రభుత్వం పోస్టింగులు ఇవ్వలేదన్నారు.

దళితులకు సంబంధించిన 27 సంక్షేమ పథకాలను అమలు చేయడం లేదని చెప్పారు. దళితులపై కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న దుర్మార్గమైన విధానాలపై రాజీలేని పోరాటం చేయాలని కోరారు. రాష్ట్రపరిస్థితులను చూస్తూ కేంద్ర పరిస్థితులను వదిలేస్తే దళితులకు నష్టం జరుగుతుందని అన్నారు. జూన్, జులై నెలల్లో రాష్ట్రంలో దళిత రక్షణ యాత్రలను కెవిపిఎస్ నిర్వహించనుందని, దీనికి అన్ని దళిత, గిరిజన, ప్రజాసంఘాలు మద్దతు పలకాలని కోరారు.

ఎపిజెఎఫ్ నాయకులు కృష్ణాంజనేయులు మాట్లాడుతూ ఎస్సీ నియోజక వర్గాల్లో టిడిపి అగ్రకులాల వారిని నియోజకవర్గ ఇన్‌ఛార్జిలుగా నియమిస్తుందన్నారు. ఇది సరికాదని దళితులనే నియమించాలని కోరారు. దళితుల అభివృద్ధిని సమాధి చేసిన జగన్‌ను ఓడించడమే తమ ధ్యేయమని కొలికపూడి శ్రీనివాసరావు అందరిచేత ప్రతిజ్ఞ చేయించారు. కాంగ్రెస్ నాయకులు కొరివి వినయ్ కుమార్, సిపిఐ నాయకులు కరవది సుబ్బారావు, టిడిపి ఎస్సీ సెల్ అధ్యక్షులు ఎంఎస్ రాజు, టిడిపి నాయకులు రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మాచ్‌ఖండ్‌లో ఆరు యూనిట్లలో విద్యుత్ ఉత్పత్తి

- అందుబాటులోకి రెండు యూనిట్లు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
ఒడిశాలోని మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రంలోని మొత్తం యూనిట్లలో విద్యుత్ ఉత్పత్తి జరుగుతుంది. మొత్తం ఆరు యూనిట్లలో రెండు యూనిట్లు రెండేళ్ల నుంచి పనిచేయడం లేదని పేర్కొన్నారు. ఈ రెండు యూనిట్లలో ఒక దానిలో ఉత్పత్తి ఈ నెల 19వ తేదీన, మరో దానిలో ఆదివారం జెన్‌కో అధికారులు పునరుద్ధరించారు. ఈ రెండు యూనిట్లను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు విడిభాగాలు, ఇతర ఎక్విప్‌మెంట్ కోసం ప్రయత్నించినా తయారీదారుల నుంచి సహకారం అందలేదని జెన్‌కో అధికారులు తెలిపారు.. ఈ యూనిట్లు అందుబాటులోకి తెచ్చేందుకు, ఎక్విప్‌మెంట్ కోసం జెన్‌కో ఎమ్‌డి చక్రధర్‌బాబు వివిధ ప్రాంతాల్లోని నిపుణులతో సంప్రదించి అధికారులకు సాంకేతిక సహకారం ఇప్పించారు. ఎమ్‌డి ప్రోత్సాహకం వల్లే రెండు యూనిట్లలో రెండేళ్ల తర్వాత విద్యుత్ ఉత్పత్తిని పునరుద్ధరించిన్నట్లు జెన్‌కో అధికారులు తెలిపారు. మాచ్‌ఖండ్‌లో 17 మెగావాట్ల సామర్థ్యంతో మూడు, 23 మెగావాట్ల సామర్థ్యంతో మరో మూడు యూనిట్లతో జల విద్యుత్ కేంద్రాన్ని ఎపి, ఒరిస్సా 1985-89 మధ్య ఉమ్మడిగా నిర్మించాయి. ఎపి 70శాతం, ఒడిశాకు 30శాతం వాటాగా నిర్ణయించి ఉమ్మడిగా ఈ విద్యుత్ కేంద్రాన్ని నిర్మించారు. ఈ పంప్‌హౌస్ నిర్వహణ, పరిపాలనా బాధ్యతలను ఎపి జెన్‌కో చూస్తోంది. 35 ఏళ్ల జీవితకాలంగా నిర్ణయించి ఈ కేంద్రాన్ని నిర్మించారు. 64 ఏళ్లు దాటినా విద్యుత్ ఉత్పత్తి నిరంతరంగా సాగుతోంది. టర్బైన్‌లు, జనరేటర్ పరికరాలు చాలా అరిగిపోయి దెబ్బతిన్నాయి. దీంతో రెండేళ్లుగా రెండు యూనిట్లు మూలనపడ్డాయి.

150 మెగావాట్లకు పెంచాలని లక్ష్యం

ప్రస్తుతం 120 మెగావాట్ల సామర్థ్యంతో ఉన్న విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని 150 మెగావాట్లకు పెంచాలని రెండు రాష్ట్రాలు నిర్ణయం తీసుకున్నాయి. పూర్తిస్థాయి మార్పులతో ఉత్పత్తి సామర్థ్యం పెంచి నవీకరించాలని ఆలోచన. ఖర్చు, విద్యుత్ వాడకం చెరిసగం ప్రాతిపదికన 50:50 వాటాతో పనులు చేపట్టాలని 2020 అక్టోబర్ 23న ఒప్పందం చేసుకున్నాయి. ఇందులో భాగంగా పంప్‌హౌస్ సామర్థ్యం పెంచి పూర్తిగా ఆధునీకరించేందుకు వీలుగా పూర్తిస్థాయిలో అధ్యయనం చేసి సమగ్ర ప్రాజెక్టు నివేదిక తయారీ బాధ్యతను టాటా కన్సల్టెన్సీకి అప్పగించాయి. ఈ కన్సల్టెన్సీ అధ్యయన ప్రక్రియను డిపిఆర్‌ను దాదాపు పూర్తిచేసిందని అధికారులు చెబుతున్నారు.


ఎన్‌టిఆర్, పూలే విగ్రహాలకు నివాళులర్పిస్తున్న యనమల, అచ్చంనాయుడు

చట్టసభల్లో బిసి రిజర్వేషన్ల కోసం పోరాటం

- కుల ప్రాతిపదికన జనాభా గణన చేయండి
- టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు యనమల

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి
చట్టసభల్లో బిసిలకు రిజర్వేషన్లు కల్పించాలని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు డిమాండ్ చేశారు. బిసిల సమస్యలపై గుంటూరులోని అరండల్‌పేటలో రౌండ్ టేబుల్ సమావేశం ఆదివారం జరిగింది. టిడిపి బిసి సాధికార సమితి రాష్ట్ర అధ్యక్షుడు కొల్లు రవీంద్ర, తెలుగుదేశం పార్టీ సాధికార సమితి ప్రధాన కార్యదర్శి వీరంకి వెంకట గురుమూర్తి, జిల్లా అధ్యక్షులు వేములకొండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో యనమల మాట్లాడుతూ బిసిలు ఐక్యంగా ఉంటేనే అన్ని హక్కులను సాధించుకోగలమని తెలిపారు. చట్టసభల్లో బిసిల రిజర్వేషన్ల డిమాండ్ చాలా కాలంగా ఉందన్నారు. కుల గణన చేయాలనే డిమాండ్ దశాబ్దాలుగా ఉన్నప్పటికీ సాధించుకోలేకపోతున్నామని తెలిపారు. కుల గణన జరిపి జనాభా దామాషా ప్రకారం నిధులివ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు మాట్లాడుతూ వెనుకబడిన తరగతుల ప్రజలను ఆర్థికంగా, సాంఘికంగా, విద్యా పరంగా అభివృద్ధి చేయకుండా తాత్కాలిక పథకాలతో మభ్యపెడుతున్నారని విమర్శించారు. స్థానిక సంస్థల్లో ఉన్న రిజర్వేషన్లను తగ్గించడం ద్వారా బిసిలను రాజకీయంగా ఎదగనీయకుండా చేశారని తెలిపారు. 56 కార్పొరేషన్ల వల్ల బిసిలకు ఒరిగిందేమిటో చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బిసి కార్పొరేషన్లకు ఇచ్చిన నిధులను లాక్కుని, కార్పొరేషన్లను ఉత్సవ విగ్రహాలుగా చేశారని విమర్శించారు. తొలుత ఎన్‌టిఆర్, పూలే విగ్రహాలకు నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమావేశంలో ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, టిడిపి నాయకులు పత్తిపాటి పుల్లారావు, నాగుల్ మీరా, గుంటుపల్లి నాగేశ్వరరావు, జనసేన నాయకుడు బోనబోయిన శ్రీనివాస్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు లింగంశెట్టి ఈశ్వరరావు, బహుజన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు దొంతా సురేష్ ప్రసంగించారు.



దీక్షల్లో కూర్చున్న ఎన్‌సిఇ యూనియన్ కార్యకర్తలు

స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ తగదు

- నేవల్ సివిల్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి పి నాగేశ్వరరావు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)
వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ ప్రతిపాదనను ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని, లేకుంటే రానున్న ఎన్నికల్లో బిజెపికి తగిన గుణపాఠం తప్పదని నేవల్ సివిల్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి పి నాగేశ్వరరావు అన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన రిలే దీక్షలు ఆదివారానికి 780వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో ఎన్‌సిఇ యూనియన్ కార్యకర్తలు కూర్చున్నారు.

ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను కావాలనే కేంద్ర ప్రభుత్వం బలహీనపరుస్తోందన్నారు. రెండేళ్లకుపైగా సాగుతున్న ఉద్యమాన్ని గుర్తించి ఇప్పటికైనా ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ నిర్వహణకు అవసరమైన సుమారు రూ.ఐదు వేల కోట్లను సమకూర్చాలని డిమాండ్ చేశారు. దీక్షలో యూనియన్ ఉపాధ్యక్షులు బి జగదీష్, కో-ఆపరేటివ్ డైరెక్టర్ ఎం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సిపిఎస్ చట్టబద్ధత కోసం ఎపిజిఇఎతో కలిసి పోరాటం

- నేటి నుంచి ఆందోళన కార్యక్రమాలు
- ఓపిఎస్ సాధన సమితి కార్యవర్గ ఎన్నిక

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
సిపిఎస్‌కు చట్టబద్ధత లేదని న్యాయస్థానంలో వ్యాజ్యం వేస్తున్న ఎపిజిఇఎతో జత కలిసి పిటిషనర్‌గా పలు సంఘాలు చేరాలని, ఎపిజిఇఎతో కలిసి జిల్లా, తాలూకా కేంద్రాల్లో ఆందోళనలు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం పిలుపునిచ్చింది. విజయవాడ విధ్యాధరపురంలోని కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం ఓపిఎస్ సాధన సమితి మొదటి కార్యవర్గ సమావేశం జరిగింది. ఈనెల 22నుంచి దశల వారీ ఆందోళనా కార్యక్రమాలు చేపట్టాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. ఓపిఎస్ సాధన సమితి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షులుగా ఎల్‌వి యుగంధర్, సహ అధ్యక్షులుగా కె.శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా డి. రాజా జస్వంత్, కార్యనిర్వాహక కార్యదర్శిగా బిఎస్ బ్రహ్మాజి, కోశాధికారిగా అబ్దుల్ నయూమ్, ఉపాధ్యక్షులుగా శరభరాజు లీలావతి, జాయింట్ సెక్రటరీగా లక్ష్మీనారాయణ, పి.సతీష్, రాష్ట్ర సమన్వయ కర్త ఎపిజిఇఎ తరపున జి. కిషోర్ కుమార్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన రాష్ట్ర సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కెఆర్ సూర్యనారాయణ ప్రసంగించారు. ఓపిఎస్ సాధన సమితి కన్వీనరు ఎల్‌వి యుగంధర్ పాల్గొన్నారు.

పేస్కేల్, స్పెషల్‌పేలపై స్పష్టత ఇచ్చే వరకు ఉద్యమం : బొప్పరాజు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
ప్రభుత్వం బకాయిపడ్డ నాలుగు డిఎలు, పిఆర్‌సి అరియర్స్, పేస్కేలు, స్పెషల్‌పేలపై ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చే వరకు ఉద్యమం కొనసాగుతుందని ఎపి జెఎసి అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, వలిశెట్టి దామోదరరావు పేర్కొన్నారు. విజయవాడ లెనిన్ సెంటర్ రెవెన్యూ భవన్‌లో ఆదివారం ఎపిజెఎసి అమరావతి అనుబంధ సంఘమైన ఎపిపిటిడి (ఆర్‌టిసి) ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర మహాసభలు పోస్టర్ రిలీజ్ కార్యక్రమం జరిగింది. బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈనెల 24న విజయవాడలో జరగనున్న ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఎపి జెఎసి అమరావతి ఉద్యమం చేపట్టి 73 రోజులైందని, ఉద్యమం ఫలితంగానే ఉద్యోగులకు కొంతమేరకు ఆర్థిక పరమైన అంశాలు పరిష్కారమయ్యాయని తెలిపారు. ఈ నెల 27న ఏలూరులో జరగనున్న మూడవ ప్రాంతీయ సదస్సులో అత్యధిక శాతం ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

రాష్ట్ర కబడ్డీ విజేతలు విజయనగరం, కృష్ణా జట్లు


విజయనగరం బాలుర జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్
అండర్-19 రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో బాలుర విభాగంలో విజయనగరం జట్టు, బాలికల విభాగంలో కృష్ణా జట్టు విజేతలుగా నిలిచాయి. అండర్-19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో విజయనగరంలోని రాజీవ్ క్రీడా ప్రాంగణంలో శని, ఆదివారాల్లో 66వ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఆదివారం కబడ్డీ ఫైనల్స్ జరిగాయి. బాలుర విభాగంలో మొదటి స్థానంలో విజయనగరం, ద్వితీయ, తృతీయ స్థానాల్లో కృష్ణ, శ్రీకాకుళం జట్లు నిలిచాయి. బాలికల విభాగంలో మొదటి స్థానంలో కృష్ణా నిలవగా, శ్రీకాకుళం రెండు, విజయనగరం మూడో స్థానం సాధించాయి. అనంతరం విజేతలకు ఎంపి బెల్లాన చంద్రశేఖర్, కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఈశ్వర్ కౌశిక్ బహుమతులను ప్రదానం చేశారు.

ఖోఖో పోటీలు ప్రారంభం

విజయనగరంలోని కస్పా హైస్కూల్ మైదానంలో అండర్-19 రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఈశ్వర్ కౌశిక్ ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి 200 మంది బాల, బాలికలు పోటీల్లో పాల్గొన్నారు. తొలుత విజయనగరం, చిత్తూరు జట్లు, ప్రకాశం, తూర్పుగోదావరి జట్ల మధ్య పోటీలు ప్రారంభమయ్యాయి. లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో మ్యాచులు జరగనున్నాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు లీగ్ పోటీలు నిర్వహించారు.


కృష్ణ బాలికల జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్

గాలివాన బీభత్సం

మొదటి పేజి తరువాయి

నేలకొరిగాయి. కలికిరి మండలంలో మామిడి కాయలు నేలరాలాయి. కోతకు వచ్చి ఉన్న వందల ఎకరాల్లో వరి మళ్లునేలమట్టమయ్యాయి. గుట్టపాలెం పంచాయతీ ఆచార్ల గొల్లపల్లిలో వెంకటప్పకు చెందిన వ్యవసాయ బోరు ట్రాన్స్‌ఫార్మర్ కిందపడిపోగా, మరో రైతులకు చెందిన రెండు విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. నిమ్మనపల్లి మండలం నిమ్మనపల్లి-కందూరు రోడ్డులో పలు చోట్ల పెద్ద చెట్లు రోడ్డుకడ్డంగా విరిగిపోవడంతో వాహనాల రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో పలుచోట్ల చెదుమదురు జల్లులు పడ్డాయి. తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం ముక్కామలలో ఈదురుగాలులకు సుమారు 150 ఎకరాల్లో అరటి చెట్లు విరిగిపోయాయి.

నేడు పలు జిల్లాల్లో తేలికపాటు వర్షాలు, పిడుగులు

విదర్భ నుంచి దక్షిణ తమిళనాడు వరకు మరాఠ్వాడ, కర్ణాటక మీదుగా ద్రోణి కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో శ్రీకాకుళం, అనకాపల్లి, అల్లూరి, వైఎస్‌ఆర్, సత్యసాయి, అనంతపురం, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో అక్కడక్కడా పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు పడే అవకాశమున్నట్లు విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది. ఈ నెల 24న అనకాపల్లి, అల్లూరి, కాకినాడ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లో అక్కడక్కడా పిడుగులతో కూడిన మోస్తారు వర్షాలు నుంచి తేలికపాటి వర్షాలు పడే అవకాశముంది. మన్యం, విజయనగరం, విశాఖ, కోనసీమ, కృష్ణ, వైఎస్‌ఆర్, సత్యసాయి, అనంతపురం జిల్లాల్లో అక్కడక్కడా పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు పడే అవకాశముంది. పిడుగులు పడే అవకాశం ఉన్నందున చెట్ల కింద ఎవరూ ఉండరాదని హెచ్చరించింది.

నేడు పలు జిల్లాల్లో వడగాల్పులు

పార్వతీపురం మన్యం జిల్లాలోని కొమరాడ, పార్వతీపురం మండలాలు, వైఎస్‌ఆర్ జిల్లాలోని కమలాపురం, ప్రొద్దుటూరు, వీరపనాయునిపల్లి, ఎర్రగుంట మండలాలు, విజయనగరం జిల్లాలోని గజపతినగరం మండలంలో వడగాల్పులు వీచే అవకాశముందని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు. మిగిలిన మండలాల్లో ఎండల తీవ్రత అధికంగా ఉండొచ్చని, ముఖ్యంగా వృద్ధులు, బాలింతలు, చిన్నారులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆదివారం నంద్యాల జిల్లా చాగలమర్రిలో 43.8 డిగ్రీలు, నెల్లూరు జిల్లా సీతారామపురంలో 43.5 డిగ్రీలు, వైఎస్‌ఆర్ జిల్లా చక్రాయపేటలో 43.3 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.



తూర్పు గోదావరి జిల్లా పెరవలి మండలం ముక్కామలలో ఈదురుగాలులకు విరిగిన అరటి చెట్లు

ఐటి ఉద్యోగి సహా ముగ్గురు మృతి

- చిన్నారికి తీవ్ర గాయాలు

వాతావరణంలో మార్పులకు రాష్ట్రానికి చెందిన ముగ్గురు మృతి చెందారు. వీరిలో ఒక ఐటి ఉద్యోగిని ఉన్నారు. మృతుల బంధువుల కథనం ప్రకారం... వైఎస్‌ఆర్ జిల్లా కలసపాడు మండలం తెల్లపాడుకు చెందిన గొర్రెల కాపరి కాకర్ల గురయ్య (39) గొర్రెలు మేపుకోనేందుకు వెళ్లారు. తిరిగి గొర్రెలతో కలిసి ఇంటికి వస్తుండగా పిడుగుపాటుకు మృతి చెందాడు. బెంగళూరులో కురిసిన భారీ వర్షానికి కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం తెలప్రోలుకు చెందిన ఐటి ఉద్యోగిని బత్తుల భానురేఖ (22) మృత్యువాత పడ్డారు. కుటుంబంతో కలిసి హైదరాబాద్ నుంచి బెంగళూరుకు వెళ్లగా వరద ముంచెత్తింది. దీంతో, వారు ప్రయణిస్తున్న కారు వరద నీటిలో చిక్కుకుంది. ఆ సమయంలో కారులో భానురేఖతోపాటు ఆమె కుటుంబ సభ్యులు ఆరుగురు ఉన్నారు. వారిని పోలీసులు, స్థానికులు బయటకు తీసుకొచ్చారు. భానురేఖ తీవ్ర అస్వస్థతకు గురవ్వడంతో ఆసుపత్రికి తరలించగా మరణించారు. చిత్తూరు జిల్లా సదుం మండలం చెనకవారిపల్లెకు చెందిన నాగేశ్వరరావు ఇంటి పైకప్పు ఎగిరిపోవడంతో ఇంటిలోని చిన్నారి సావిత్రి (2) తీవ్రంగా గాయపడింది. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం రింగల గ్రామానికి చెందిన రాజయ్య (60) వడదెబ్బకు మృతి చెందారు. వ్యక్తిగత పనులపై బయటకు వెళ్లి వచ్చిన ఆయన ఎండ తీవ్రతకు స్పృహ తప్పిపడిపోయి ప్రాణాలు కోల్పోయాడు.

మిగ్-21పై తాత్కాలిక నిషేధం



న్యూఢిల్లీ : మిగ్-21 యుద్ధ విమానాల సేవలను భారత వైమానిక దళం (ఐఎఎఫ్) తాత్కాలికంగా నిలిపివేసింది. ఇటీవల రాజస్తాన్‌లోని హనుమాన్‌గఢ్ వద్ద ఓ మిగ్ -21 యుద్ధ విమానం నివాసంలోకి దూసుకుపోవడంతో ముగ్గురు పౌరులు మృతిచెందిన సంగతి తెలిసిందే. మే 8న సూరత్‌గఢ్‌లోని సాధారణ శిక్షణ నిమిత్తం బయలుదేరిన కొద్దిసేపటికే విమానం కుప్పకూలింది. దీంతో మిగ్-21 విమానాలను అధికారులు నిలిపివేశారు. నిపుణుల బందం పరిశీలించి, ఆమోదించిన అనంతరం ఈ యుద్ధ విమానాల సేవలను తిరిగి ప్రారంభిస్తారని సంబంధిత అధికారులు వెల్లడించారు.

ఎల్‌ఐసిని కార్పొరేట్లకు దోచిపెడితే ఊరుకోం

మొదటి పేజి తరువాయి

రెగ్యులేటరీ బిల్లు తీసుకొచ్చి నాలుగైదు రెట్లు కరెంట్ బిల్లులను పెంచిందని, ఆస్తి, చెత్త పన్నుల భారాన్ని విపరీతం చేసిందని విమర్శించారు. పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలు దారుణంగా పెరిగాయన్నారు. ఈ ఆర్థిక భారాల కారణంగా ప్రజలు పొదుపు చేసే అవకాశాన్ని, శక్తిని కోల్పోయే పరిస్థితి నెలకొందని తెలిపారు. ఎల్‌ఐసిని, ఏజెంట్లను రక్షించుకోవడానికి పోరాటం తప్ప, మరొక మార్గం లేదన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మే హక్కు మోడీకి ఎక్కడిదని ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాలను మోడీ వద్ద ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తాకట్టు పెట్టారని విమర్శించారు. మహాసభలో జోనల్ అధ్యక్ష, కార్యదర్శులు మంజునాథ, నరసింహారావు, డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, ఠాగూర్, సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ పాల్గొన్నారు.

బాలికపై సైకో దాడి

- ప్రాణాపాయ స్థితిలో బాధితురాలు
- సైకోను కొట్టి చంపిన గ్రామస్తులు

ప్రజాశక్తి - గుర్రంకొండ (అన్నమయ్య జిల్లా)

పొలం దగ్గర ఒంటరిగా ఉన్న బాలికపై ఓ సైకో దాడి చేసి గాయపరచడంతో ఆమె ప్రాణాపాయస్థితికి చేరుకుంది. విషయం తెలుసుకున్న ఆమె బంధువులు సైకోను రాళ్లతో కొట్టి చంపారు. ఈ సంఘటన అన్నమయ్య జిల్లా గుర్రంకొండ మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పసలబాండ్లపల్లె పంచాయతీ పరిధిలోని తుమ్మలగొంది ఉదిగోళ్లపైకెల చెందిన మహేశ్వరి ఆదివారం పశువులను మేపేందుకు పొలానికి వెళ్లింది. ఆ సమయంలో అదే గ్రామానికి చెందిన ఉత్తన్న (47) పొలంలోకి పశువులు వెళ్లడంతో కోపోద్రిక్తుడై బాలికపై రాళ్లతో దాడి చేశాడు. దీంతో బాలిక తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలోకి వెళ్లింది. బాలిక తల్లిదండ్రులు ఆకుపల్లె, ఆదిలక్ష్మమ్మ, బంధువులు గాయపడిన ఆమెను మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితురాలి బంధువులు దాడి చేసిన ఉత్తన్నను రాళ్లతో కొట్టి చంపేశారు. ఈ ఘటనపై గుర్రంకొండ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. బాధితురాలి పెద్దనాన్నపైనా ఉత్తన్న దాడి చేశాడు. రెండేళ్ల కిందట తన భార్యను చంపిన కేసులో నిందితుడిగా ఉత్తన్న ఉన్నాడు.

విఆర్ఎల సమస్యలు పరిష్కరించాలి

- సంఘం రాష్ట్ర అధ్యక్షులు పెద్దన్న

ప్రజాశక్తి - కడప అర్బన్

విఆర్ఎలకు ఇచ్చిన హామీని, వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని విఆర్ఎ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పెద్దన్న డిమాండ్ చేశారు. కడపలోని సిఐటియు కార్యాలయంలో ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. 2017లో విఆర్ఎ ధర్నాకు జగన్మోహన్‌రెడ్డి హాజరై అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.15000 వేతనం ఇస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత విఆర్ఎలకు జీతాలు పెంచకపోవడం అన్యాయమన్నారు. నామినీలుగా పని చేస్తున్న వారిని విఆర్ఎలుగా నియమించాలని డిమాండ్ చేశారు. అర్హులైన వారందరికీ వాచ్‌మెన్, అటెండర్, డ్రైవర్ అన్ని రకాల ఉద్యోగోన్నతులు కల్పించాలని కోరారు. విఆర్ఎల సమస్యలు పరిష్కరించకుంటే రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో విఆర్ఎ సంఘం నాయకులు కర్నూలు అంజి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి మనోహర్, విఆర్ఎ సంఘం నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విఆర్ఎ సంఘం కడప జిల్లా కన్వీనర్‌గా నాగేంద్రను ఎన్నుకున్నారు.

పెద్దపులి సంచారంతో కలకలం

ప్రజాశక్తి-అర్ధవీడు (ప్రకాశం జిల్లా)

ప్రకాశం జిల్లా అర్ధవీడు గ్రామంలో పెద్దపులి సంచారం కలకలం రేపింది. ఆగులేటి కోసం పెద్దపులి నల్లకొండ దిగి నాగులవరం పూర్వ రహదారి దాటుకుని కంభం చెరువువైపు రావడాన్ని కొందరు గుర్తించి భయాందోళనకు గురయ్యారు. దాహం తీర్చుకుని వెలిగొండ ప్రాజెక్ట్ తూర్పు ప్రధాన కాలువ మీదుగా నల్లకొండ ఎక్కివెళ్లిన పులి ఆనవాళ్లను గుర్తించారు. గ్రామస్తుల సమాచారంతో అటవీశాఖ అధికారులు పులి పాదముద్రలు సేకరించారు. ఎవరూ భయాందోళన చెందాల్సిన పనిలేదని, పులి నుంచి ప్రజలకు భద్రత కల్పిస్తామని అటవీ శాఖ అధికారులు తెలిపారు.

ఒక్క బస్సూ కొనరేం?

- నాలుగేళ్లుగా కాలం చెల్లిన బస్సులతో కాలయాపన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ఎపిఎస్ఆర్‌టిసి ఉద్యోగులందరినీ ప్రభుత్వంలో విలీనం చేశామని ఆర్భాటంగా చెబుతున్నా, ఆచరణలో నిర్వీర్యం చేసే దిశగా అడుగులు వేస్తోందని ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పొరుగున వున్న తెలంగాణాలోని ఆర్‌టిసి కొత్త సర్వీసులను ప్రవేశపెడుతూ కొత్త బస్సులను కొనుగోలు చేస్తుంటే రాష్ట్రప్రభుత్వం ఈ నాలుగేళ్లలో ఒక్క కొత్త బస్సునూ కొనుగోలు చేయని పరిస్థితి వుంది. దీంతో, కాలం చెల్లిన బస్సుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ప్రతి ఏటా కొత్తగా బస్సులను కొనుగోలు చేయాల్సిన సంస్థ నాలుగేళ్లుగా ఒక్క బస్సూ కొనుగోలు చేయలేదు. కాలపరిమితి తీరిన బస్సుల్లో ప్రయాణం ప్రయాణికులను చికాకు పెట్టిస్తోంది. సాధారణంగా ఏ బస్ అయినా ఏడు నుంచి 8 లక్షల కిలోమీటర్లు నడవగానే, పూర్తిగా పక్కన పెట్టేయాల్సి ఉంది. 11లక్షల కిలోమీటర్లు తిరిగిన బస్సులను కూడా ఆర్‌టిసి రోడ్డుపై నడుపుతోందంటే ప్రయాణికుల భద్రతకు ఇచ్చే ప్రాధాన్యతను అర్థం చేసుకోవచ్చు.



ఎపిఎస్ ఆర్‌టిసిలో మొత్తం 129 డిపోల పరిధిలో 11,099 బస్సులు ఉన్నాయి. వాటిలో ఆర్‌టిసికి 8,535 సొంతబస్సులు వుంటే, మిగిలిన 2,564 హైర్‌బస్సులే. ప్రస్తుతం ఆర్‌టిసిలో అద్దెబస్సుల వాటా 23శాతంకాగా, ప్రభుత్వం 32 శాతానికి పెంచేందుకు కసరత్తు చేస్తోంది. కొత్త బస్సులు కొనుగోలు చేయకుండా హైర్‌బస్సులతోనే సర్వీసులు నడిపేలా ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలపట్ల ఉద్యోగసంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. దూరప్రాంతాలకు తిరిగే ఎసి బస్సులు మినహా సూపర్‌లగ్జరి, అల్ట్రా డీలక్స్, ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగు ఇలా అన్ని రకాల సర్వీసులకు హైర్‌బస్సులను తీసుకుంటున్న ప్రభుత్వ తీరుపై కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొత్తబస్సులు ఏమాత్రం కొనుగోలు చేయకుండా ఇప్పుడున్న బస్సులను వీలైనంత వరకూ నడిపి ఆ తర్వాత అన్ని సర్వీసులనూ హైర్‌బస్‌లతోనే నడిపేందుకు ప్రభుత్వం ప్రణాళికలు తయారు చేస్తోంది. మొత్తం హైర్‌బస్‌లపైనే ఆధారపడితే భవిష్యత్‌లో వాటి యజమానులు తమ డిమాండ్ల సాధన కోసం హైర్‌బస్‌లన్నీ ఒకేసారి నిలిపివేస్తే ప్రజారవాణా పరిస్థితి ఏమిటనేది చర్చనీయాంశం అవుతోంది. ప్రజారవాణాకు భరోసా కల్పించేలా ఆర్‌టిసి సొంతబస్సులకు ప్రాధాన్యత ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజల దృష్టి మళ్లించేందుకే నోట్ల రద్దు

- స్మార్ట్ మీటర్లతో ఉచిత విద్యుత్ నిర్వీర్యం
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు


ప్రజాశక్తి - సత్తెనపల్లి (పల్నాడు జిల్లా)

కేంద్ర ప్రభుత్వం సమస్యలపై ప్రజల దృష్టిని మళ్లించేందుకే రెండువేల నోటు రద్దును తెరమీదకు తీసుకువచ్చిందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు విమర్శించారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడారు. 2016లో కేంద్ర ప్రభుత్వం రూ.500, రూ.వెయ్యి నోట్లు రద్దుచేసి మొత్తం బ్లాక్ మనీని వెలికి తీస్తామని చెప్పి ప్రజలను మోసం చేసిందన్నారు. దీని వల్ల జనం వద్ద ఉన్న డబ్బు మొత్తం ప్రభుత్వానికి, ప్రభుత్వం నుంచి కార్పొరేట్లకు చేరిందని విమర్శించారు. ఇప్పుడు మళ్ళీ రూ.2 వేల నోటు రద్దు చేశారని తెలిపారు. ఈ నోట్లు జనం వద్ద లేవని, కార్పొరేట్లు, సంపన్నుల చేతుల్లోనే ఉన్నాయన్నారు. రద్దయిన ఆ నోట్లను వాళ్లు సులభంగా మార్చుకుంటారని తెలిపారు. కేంద్రం ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ చట్టాన్ని సవరించి మొదటి దశగా నాలుగు లక్షల స్మార్ట్ మీటర్లను ఇళ్లకు బిగించేందుకు, దాని ఖర్చు మొత్తాన్ని వినియోగదారుల నుండి వసూలు చేసేందుకు ప్రణాళికను సిద్ధం చేసిందన్నారు. స్మార్ట్ మీటర్ల టెండర్లను అదానీ కంపెనీలకు ఇచ్చేందుకు ప్రయత్నం జరుగుతోందని, దీని వల్ల ప్రజలపై విద్యుత్ భారం మరింత పెరగడమే కాకుండా ప్రీపెయిడ్ పేరుతో వినియోగదారులు ముందుగానే రీఛార్జ్ చేయించుకొని విద్యుత్‌ను వినియోగించుకోవాల్సి వస్తుందని తెలిపారు. మరోవైపు రాష్ట్రంలో తీవ్రమైన విద్యుత్ కొరతను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. దీనిని అధిగమించాల్సిందిపోయి విద్యుత్ కంపెనీల వద్ద అధిక ధరలకు విద్యుత్‌ను కొనుగోలు చేయడం వలన ఉత్పత్తిదారులకు లాభపడతారని, వినియోగదారులకు భారం పడుతుందన్నారు. స్మార్ట్ మీటర్లు బిగించడం వలన భవిష్యత్తులో ఉచిత విద్యుత్తును నిర్వీర్యం చేసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే అప్రకటిత విద్యుత్ కొరతను ప్రజలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. దేశంలో షేర్ మార్కెట్లో సంక్షోభంలో పడటానికి, మధ్య తరగతి మదుపుదారులు దెబ్బ తినడానికి కారణమైన అదానీ కంపెనీలకు స్మార్ట్ మీటర్ల టెండర్లు కట్టబెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తోన్న ప్రయత్నాలను సిపిఎం తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు. సమావేశంలో సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్, కార్యదర్శివర్గ సభ్యులు ఎ లక్ష్మీశ్వరరెడ్డి, వై రాధాకృష్ణ, జి రవిబాబు, ఎస్ ఆంజనేయులు నాయక్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి విలేకరి అంజయ్య హఠాన్మరణం

- పలువురి సంతాపం

ప్రజాశక్తి-మద్దిపాడు (ప్రకాశం జిల్లా)



కానుమాను అంజయ్య(ఫైల్)

ప్రకాశం జిల్లాలో మద్దిపాడు మండల ప్రజాశక్తి విలేకరి కాకుమాను అంజయ్య(62) శనివారం అర్ధరాత్రి హఠాన్మరణం చెందారు. గత 20 సంవత్సరాలుగా ప్రజాశక్తి దినపత్రికలో విలేకరిగా ఆయన పనిచేస్తున్నారు. అంజయ్య సిపిఎం మద్దిపాడు గ్రామ శాఖ సభ్యునిగా ఉన్నారు. సీనియర్ జర్నలిస్టుగా ఉన్న ఆయన్ను ఇటీవల ప్రెస్ క్లబ్ మండల అధ్యక్షులుగా ఎన్నుకున్నారు. అంజయ్య మృతికి ప్రజాశక్తి ఎడిటర్ బి తులసీదాస్ ఫోన్ ద్వారా సంతాపాన్ని తెలియజేశారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. అంజయ్య భౌతికకాయాన్ని సంతనూతలపాడు మాజీ శాసన సభ్యులు బిఎన్ విజయ్ కుమార్ సందర్శించి నివాళులర్పించారు.

సిపిఎం నివాళి..

అంజయ్య భౌతికకాయానికి సిపిఎం నాయకులు సందర్శించి నివాళులర్పించారు. వారిలో సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పూనాటి ఆంజనేయులు, జాలా అంజయ్య, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జివి కొండారెడ్డి, షేక్ మాబు, కంకణాల ఆంజనేయులు, కాలం సుబ్బారావు, బంకా సుబ్బారావు, ప్రజాశక్తి ఒంగోలు ఎడిషన్ మేనేజర్ ఎంఎల్‌వి ప్రసాద్, బ్యూరో ఎస్‌వి బ్రహ్మం, డెస్క్ ఇన్‌ఛార్జి తారక రామారావు, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కెఎఫ్ బాబు, సిపిఎం మండల కార్యదర్శి ఉబ్బా ఆదిలక్ష్మి, సిపిఐ నాయకులు పావులూరి అంజయ్య ఉన్నారు.

వాంబే కాలనీలో రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మించాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాబూరావు

ప్రజాశక్తి-సింగ్‌నగర్ (ఎన్‌టిఆర్ జిల్లా)



వాంబే కాలనీ వద్ద రైల్వే ట్రాక్‌ను పరిశీలిస్తున్న బాబూరావు

ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడ వాంబే కాలనీలోని రైల్వే ట్రాక్ వద్ద అండర్ బ్రిడ్జి నిర్మించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు డిమాండ్ చేశారు. సింగ్‌నగర్‌లోని వాంబే కాలనీ ప్రాంతంలో సిపిఎం నేతలు ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ.. నిత్యం వేలాది మంది రాకపోకలు సాగించే ఈ ప్రాంతంలో గత 20 ఏళ్లుగా రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మిస్తామని ప్రజాప్రతినిధులు హామీలు ఇస్తున్నారే తప్ప పట్టించుకోవడంలేదని తెలిపారు. రోజు వారి పనులకు వెళ్లే మహిళలు పెరిగిన ప్రయాణ ఖర్చులు భరించలేక కాలినడకన రైల్వే ట్రాక్ దాటాల్సి వస్తోందన్నారు. సింగ్‌నగర్ ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై ట్రాఫిక్ గంటల తరబడి నిలిచిపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ క్రమంలో స్థానిక ప్రజలు రైల్వే ట్రాక్ దాటుతున్నారన్నారు. ఇటీవల కాలంలో రైల్వే ట్రాక్ దాటుతున్న ప్రజలను రైల్వే పోలీసులు నిర్బంధించి రూ.500 నుండి వెయ్యి రూపాయల జరిమానా విధించారని, ఫెనాల్టీ చెల్లించకపోతే ఆరు నెలలు జైలు శిక్ష విధిస్తామని బెదిరిస్తున్నారని తెలిపారు. ఇప్పటికే వందలాది మందిని రైల్వే కోర్టులకు తీసుకెళ్లి ఇబ్బందులకు గురి చేశారన్నారు. ప్రజలు నడవడానికి వీల్లేకుండా రైల్వే ట్రాక్ వెంట పెద్ద గోతులు తవ్వుతున్నారని తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు ప్రేక్షకపాత్ర పోషిస్తూ అండర్ బ్రిడ్జి నిర్మాణంపై దృష్టి పెట్టడంలేదన్నారు. రైల్వే పోలీసుల వేధింపులు ఆపాలని, అక్రమ పెనాల్టీలు, కేసులు నిలిపివేయాలని, అండర్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.దుర్గారావు, సిహెచ్ శ్రీనివాస్, ఎస్.కె.పీరూసాహెబ్ తదితరులు పాల్గొన్నారు.



మైనింగ్ కార్మికుల సమావేశంలో మాట్లాడుతున్న నారాలోకేష్

మైనింగ్ కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక ప్రణాళిక

- ముఖాముఖిలో నారా లోకేష్

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

టిడిపి అధికారంలోకి రాగానే మైనింగ్ కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తామని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ హామీ ఇచ్చారు. ఆయన చేపట్టిన యువగళం పాదయాత్ర ఆదివారం బనగానపల్లె నియోజకవర్గంలో సాగింది. బనగానపల్లె మండలం అమడాలమెట్ట నుంచి ప్రారంభమైన పాదయాత్ర కోవెలకుంట్ల మీదుగా ఆళ్లగడ్డ నియోజకవర్గంలోకి ప్రవేశించి దొర్నిపాడు విడిది కేంద్రం వరకూ కొనసాగింది. పాదయాత్ర ప్రారంభానికి ముందు అమడాలమెట్ట విడిది కేంద్రం వద్ద మైనింగ్ యజమానులు, కార్మికులతో లోకేష్ మాట్లాడారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే మైనింగ్ కార్మికులకు మెరుగైన జీతాలు, ఆరోగ్య బీమా, ఇఎస్ఐ సదుపాయం, ప్రమాద బీమా అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కాస్ట్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ తీసుకొస్తామని, వ్యాపారాలు తక్కువ పెట్టుబడితో చేసుకునే వాతావరణం తీసుకొస్తామని హామీ ఇచ్చారు. జగన్ ప్రభుత్వంలోని మైనింగ్ బాధితులకు న్యాయం చేస్తామని, రాజకీయ ప్రమేయం లేకుండా మైనింగ్ వ్యాపారం చేసుకునే విధంగా ప్రోత్సహిస్తామన్నారు. జగన్ చెత్త జిఒల వల్ల మైనింగ్ రంగంలో దాదాపు 30 లక్షల మంది ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డారని, ఆ జిఒలన్నీ రద్దు చేస్తామని హామీ ఇచ్చారు. తెచ్చుకున్న అనుమతుల ఆధారంగా ఆక్షన్ పాలసీ రూపొందించి జగన్ అనుచరులకు దోచిపెడుతున్నారని విమర్శించారు. సమావేశంలో బనగానపల్లె నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బిసి జనార్ధన్‌రెడ్డి, డోన్ ఇన్‌ఛార్జి ధర్మవరం సుబ్బారెడ్డి, నందికొట్కూరు ఇన్‌ఛార్జి మాండ్ర శివానందరెడ్డి పాల్గొన్నారు. అనంతరం పాదయాత్ర కోవెలకుంట్ల మీదుగా సాగింది. వివిధ తరగతుల ప్రజలు లోకేష్‌ను కలిసి తమ సమస్యలను చెప్పుకున్నారు.

నేడు మచిలీపట్నానికి సిఎం

- బందరు పోర్టు నిర్మాణ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం మచిలీపట్నం పర్యటనకు వెళ్లనున్నారు. ఉదయం 8.30 గంటలకు తాడేపల్లిలోని నివాసం నుంచి బయలుదేరి బందరు మండల పరిధిలోని తపసిపూడి గ్రామం చేరుకుంటారు. ఆ గ్రామంలో బందరు పోర్టు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం మచిలీపట్నంలోని జిల్లా పరిషత్ సెంటర్ భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ మైదానంలో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో ప్రజలనుద్దేశించి మాట్లాడతారు. సభ అనంతరం మచిలీపట్నం నుంచి బయలుదేరి మధ్యాహ్నం తాడేపల్లి నివాసానికి చేరుకుంటారు.

గతంలో వైఎస్ఆర్, చంద్రబాబు శంకుస్థాపన

బందరు ప్రాంత ప్రజల దశాబ్దాల కలైన బందరుపోర్టుకు సిఎం శంకుస్థాపన చేస్తున్నారు. ఇదే బందరు పోర్టు పనులకు 2009లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, 2019లో నారా చంద్రబాబునాయుడు శంకుస్థాపన చేశారు. వారు కూడా అప్పట్లో ఎన్నికలకు ముందే శంకుస్థాపన చేయడం గమనార్హం. మరో 10నెలల్లో రాష్ట్రంలో ఎన్నికలు రానున్న నేపథ్యంలో ఇప్పుడు సిఎం జగన్‌మోహన్‌రెడ్డి మరోమారు శంకుస్థాపనకు పూనుకోవడం విశేషం. మూడో శంకుస్థాపనతోనైనా పనులు పూర్తవుతాయా? అనేది చర్చనీయాంశమైంది.

మోడీని ఎదిరించే సత్తా బిఆర్ఎస్‌కు ఉంది

- టిడిపి, వైసిపిలకు ప్రత్యామ్నాయం రూపొందిస్తాం
- పార్టీ రాష్ట్ర కార్యాలయాన్ని ప్రారంభించిన తోట చంద్రశేఖర్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

దేశంలో నియంతృత్వ పాలన చేస్తోన్న నరేంద్ర మోడీని ఎదిరించే ధైర్యం బిఆర్ఎస్ అధినేత కెసిఆర్‌కే ఉందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు తోట చంద్రశేఖర్ అన్నారు. గుంటూరు ఆటోనగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన పార్టీ రాష్ట్ర కార్యాలయాన్ని చంద్రశేఖర్ ప్రారంభించారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టిడిపి, వైసిపి పార్టీలు రాష్ట్రాన్ని అథోగతి పాలు చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. టిడిపి వైఫల్యాలతో విసుగెత్తిన ప్రజలకు మరే ప్రత్యామ్నాయం లేక 2019లో వైసిపికి ఓటు వేశారని తెలిపారు. వైసిపి, టిడిపికి బిఆర్ఎస్సే ప్రత్యామ్నాయమని అన్నారు. రాష్ట్ర ప్రజలను ఆ రెండు పార్టీలు మోసగించాయని విమర్శించారు. 22 మంది లోక్‌సభ సభ్యులున్నా ప్రత్యేక హోదాను సాధించలేకపోయారని అన్నారు. విభజన చట్టంలో కేంద్రం ఇచ్చిన హామీలు అమలు చేయకపోయినా టిడిపి, వైసిపి నాయకులు నోరుమెదపకపోవడం దారుణమని పేర్కొన్నారు.

విశాఖ ఉక్కును ప్రయివేటీకరణ చేస్తామన్నా ఈ రెండు పార్టీలు పట్టించుకోవడం లేదన్నారు. బిజెపి హయంలో ప్రభుత్వ రంగ సంస్థలు ప్రయివేటీకరణ చేస్తే వాటిని కెసిఆర్ ప్రధాని కాగానే తిరిగి ప్రభుత్వ పరం చేస్తారని హామీ ఇచ్చారు. బిఆర్ఎస్ రాకతో టిడిపి, వైసిపిలకు ప్రజలు బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. రానున్న కాలంలో బిఆర్ఎస్ రాష్ట్ర రాజకీయాల్లో కీలక పాత్ర పోషించనుందని స్పష్టం చేశారు.

అవార్డుకు అప్లై చేసుకోండి

- రాష్ట్రాలకు స్కోచ్ నుంచి లేఖలు
- అంతా భేష్ అంటూ ప్రతిపాదనలు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ప్రతియేటా రాష్ట్ర ప్రభుత్వ శాఖల పనితీరుపై స్కోచ్ సంస్థ ఇచ్చే అవార్డులపై మళ్లీ దరఖాస్తులు కావాలని పిలుపు వచ్చింది. ఏటా ఇలాగే అన్ని రాష్ట్రాల నుంచి దరఖాస్తులు ఆహ్వానించడం, వాటిని పరిశీలించి అవార్డులు అందించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ అవార్డులపై ఉన్నతాధికారుల్లోనే చర్చ జరుగుతోంది. ఇలా దరఖాస్తులు ఆహ్వానించడం వల్ల రాష్ట్రాల నుంచి అంతా బాగుందనే భావనతోనే నివేదికలు వెళ్తున్నట్లు అధికారులే అంగీకరిస్తున్నారు. తాజాగా వ్యవసాయ అనుబంధ రంగాలు, పౌరసరఫరాలు, జిల్లాల పాలన, విద్య, ఆర్థిక, అటవీ, సాధారణ పరిపాలన శాఖ, వైద్య ఆరోగ్యం, నీటిపారుదల సంక్షేమం వంటి అనేక కీలక శాఖల నుంచి ప్రతిపాదనలు ఆహ్వానిస్తూ స్కోచ్ నుంచి లేఖ అందింది. ఈ లేఖ ఆధారంగా అన్ని శాఖలనూ అవార్డులకు ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించాలని స్వయంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కూడా సర్క్యులర్ జారీ చేశారు. ఈ ప్రతిపాదనల ఆధారంగానే అవార్డుల ప్రదానం కూడా జరుగుతుందని అధికారులు చెబుతున్నారు. ఈ ప్రతిపాదనల్లో అంతా భేషుగ్గా ఉందని, అభివృద్ధి చాలా బాగుందంటూనే ప్రతిపాదనలు వెళ్తున్నట్లు ఒక అధికారి వ్యాఖ్యానించడం గమనార్హం. ఇలా పంపించడం సరికాదన్న భావాన్ని కూడా ఆయన వ్యక్తం చేశారు.



గోదావరిలో ఇద్దరు యువకుల మృతి

ప్రజాశక్తి - ఆలమూరు(డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా)

గోదావరి నదిలో స్నానానికి దిగి ఇద్దరు యువకులు మృతి చెందారు. ఈ సంఘటన డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం జొన్నాడలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... కొత్తపేట మండలం ముక్కామల, కొత్తపేటకు చెందిన ఆరుగురు యువకులు గోదావరి నదిలో స్నానం చేసేందుకు ఆలమూరు మండలం జొన్నాడ వెళ్లారు. స్నానం చేసేందుకు గోదావరిలో దిగారు. లోతు ఎక్కువగా ఉండడంతో ముక్కామలకు చెందిన మోటూరి త్రిలోక్ (15), కొత్తపేటకు చెందిన గెడ్డం కరణాకర్ (23) మునిగిపోయారు. మిగిలిన నలుగురూ ప్రాణాలతో బయపడ్డారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను వెలికి తీశారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కొత్తపేట ప్రభుత ఆస్పత్రికి తరలించారు.

అటవీ భూములు ఆదివాసీలవే : వాసవి కిరో

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

అటవీ భూములు ఆదివాసీలవేనని, అంబానీ, అదానీలకు వాటిపై ఎటువంటి హక్కూ లేదని జార్ఖండ్ రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ సభ్యులు, ఆదివాసీ రచయిత డాక్టర్ వాసవి కిరో అన్నారు. విశాఖలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఆదివారం జరిగిన అఖిలభారత ఆదివాసీ సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలైనా నేటికీ గిరిజనులకు వైద్యం అందడంలేదన్నారు. వ్యాధులు, పౌష్టికాహార లోపంతో వేల మంది పిల్లలు మృతి చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన మహిళ రాష్ట్రపతిగా ఉండి కూడా అటవీ గిరిజన చట్టాలను ఎందుకు అమలు చేయడంలేదని ప్రశ్నించారు. ఎపిలో పెద్ద సంఖ్యలో గిరిజనులు ఉన్నప్పటికీ వారికి అకాడమీ లేకపోవడం శోచనీయమన్నారు. గిరిజన చట్టాలను పాలకులు సవరించడం దారుణమని తెలిపారు. గిరిజనుల దోస్తులు ఎర్రజెండాల వారేనని, వారితో కలిసి పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రముఖ న్యాయవాది పల్లా త్రినాథరావు మాట్లాడుతూ కార్పొరేట్ల మైనింగ్ కార్యకలాపాల కోసం అటవీ చట్టాలను మార్చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం 60 శాతం గిరిజన భూములు గిరిజనేతరుల చేతుల్లోనే ఉన్నాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. సదస్సు ఆహ్వాన సంఘం అధ్యక్షులు వివి రమణమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎఐకెఎంఎస్ జాతీయ అధ్యక్షుడు వేములపల్లి వెంకట రామయ్య, అఖిల భారత ఆదివాసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆసీష్ మిట్టల్, వివిధ రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సదస్సులో డాక్టర్ వాసవి కిరో హిందీలో రచించిన 'ఆదివాసీ వీరనారీల చరిత్ర' పుస్తకాన్ని ఆవిష్కరించారు.

ప్రజాశక్తి
www.prajasakti.com
facebook/prajasakti, twitter/prajasakti



పది మందికి ప్రేరణ కలిగించే
ఓటమి... వెయ్యి ఏనుగుల బలంతో
సమానం

-శ్రీరంగం శ్రీనివాసరావు

వాడికి నేర్పు

వాడికి రెక్క లిచ్చావ్
చిట్టి పొట్ట కోసమో
బుజ్జి గూడు కోసమో..
ఎలాగూ ఎగురుతాడు

పర్వతపు శిఖరం దాకా ఎగరమనో
తనదైన జెండా ఒకటి
పాతేసుకోమనో
ఆ రెక్కలను ఎలాగూ నిమురుతావ్

దిశ అదొకటేనా
నిర్దేశించేది రెక్కలకు మాత్రమేనా..

కాలి గోళ్ళ కూ కాస్త నేర్పు..!

ఆడపిల్లల్ని తన్నుకుపోయి
గుచ్చి గుచ్చి గాయం చేసి
పొడిచి పొడిచి..ప్రాణం తీసేసేందుకా..
వాడికి గోళ్ళున్నది..?

కొమ్మలను కరుచుకునేందుకు కదా..!

నేర్పితే గీర్పితే..
కల్మషం లేకుండా కరగడం నేర్పు
అమానుషాలకు..ఆగడాలకు
ఆమడదూరముండేలా నేర్పు

తల్లిని చెలిని..అక్కను చెల్లిని
అక్కున చేర్చుకోవడం నేర్పు

ఆక్షేపణ..ఆరడి
కూల్చి..కాల్చే విధ్వంసమూ..
జీవనాలలోకి చొరబడటం కాదు..!

ఆద్యంతం..
ఆడబిడ్డలకు తోడుగా ఎగర నివ్వడం నేర్పు !

వివక్ష లెరుగని
పిట్ట దొడ్డ మనసును
లోయలలో ఎగిరే..రెక్కల బలాన్ని
రహదారుల్లో సంచరించే..నిర్భీతిని
ఆడపిల్లల్లోకి ఒంపమని నేర్పు

అడ్డదిడ్డంగా ఎగిరితే
వాడి రెక్కలను తెగేసే అవకాశం
ఎప్పుడూ ఉందనే నేర్పు..!

– డా.దారల విజయ కుమారి
9177192275

సంపూర్ణం...!

దాహాలు అసంపూర్ణంగానే
ఆరంభమౌతాయి.
ఆలోచనల సంఘర్షణలోంచి
ఒక దారి తళుక్కున మెరుస్తుంది.

ఒక లక్ష్యం
నిద్రలేని క్షణాల్ని వేలాడదీస్తుంది.

జీవితం
ఒక్కో పాదముద్రను చెక్కుతూ
నిరాడంబరంగా
విజయానికో చిరునవ్వు
విసురుకుంటూ ముందుకు పోతుంది.

ప్రతి క్షణమూ తిరిగిరానిదే.

ఇక్కడ ఛేదించాల్సినవి
చేయాల్సినవి కొన్ని వుంటాయి.

అలా అలా సంతోషాల్ని
లిఖిస్తూ కాస్త ముందుకు జరగాలి.

అసంపూర్ణం నుంచి సంపూర్ణానికి
ఒక్కో అడుగు తొడుగుతూ
ఒక్కో మైలురాయి లో చిహ్నాల్ని
కొన్ని తీపి గురుతులు గా నిలిపి
సంపూర్ణ ప్రయాణం గా
ప్రయత్నాల్ని మలచుకోవడం లోనే వుంది.
జీవితపు గెలుపు రహస్యం.

– గవిడి శ్రీనివాస్
7019278368

ఒకనక్క

జిత్తుల మారి పనులు జేసి
పరుగెత్తుకు వచ్చింది
ఏ పొదల్లోనో దూరేసి దాక్కుంది
సర్కారు దాని ఆచూకి కై
అక్కడ చాటింపు వేయించింది
చుట్టూరా సహకారం కరువైంది
ఇక
శిక్షించాలని ఏకంగా నిప్పు పెట్టింది
నక్క చచ్చింది
కానీ
అడివిలో పశుపక్ష్యాదులన్నీ
అల్పజీవులన్నీ
అగ్నిజ్వాలలకు ఆహుతయ్యాయి
దోపిడీకి సహకారం
తప్పని పర్యవసానం

– కోటం చంద్రశేఖర్
9492043348

"నీటి గింజల పంట" ఆవిష్కరణ

కంచరాన భుజంగరావు కవితా సంపుటి "నీటి గింజల పంట" ఆవిష్కరణ శ్రీకాకుళంలోని గ్రాండ్ హెూటల్ లో మే 27 (శనివారం) ఉదయం 9 గంటలకు జరగనుంది. అట్టాడ అప్పలనాయుడు అధ్యక్షత వహిస్తారు. కె. శివారెడ్డి పుస్తకాన్ని ఆవిష్కరిస్తారు. జి లక్ష్మి నరసయ్య ముఖ్య అతిథిగా, పుప్పాల శ్రీరాం, అనిల్ డ్యాని సమీక్షకులుగా, జిల్లా విద్యాశాఖాధికారి ఎస్ తిరుమల చైతన్య, గంటేడ గౌరునాయుడు, కొప్పల భానుమూర్తి తదితరులు హాజరు కానున్నారు.

– సిక్కోలు బుక్ ట్రస్ట్,
శ్రీకాకుళ సాహితి.

రాయలసీమ మహాకవిసమ్మేళనం..

రాయలసీమ సాంస్కృతికోద్యమంలో భాగంగా "రాయలసీమ సాంస్కృతిక వేదిక" ఏడవ రాయలసీమ మహా కవిసమ్మేళనం నిర్వహిస్తుంది.

"రాయలసీమ కీలక సమస్యలు– భవితవ్యం" ఇతివృత్తంగా రాసిన కవితలను మే 25 2023 లోపు 99625 44299 వాట్సప్ నెంబరుకు పంపాలని కోరుతున్నాం.

అంతర్జాల వేదికన మే28 ఆదివారం నాడు కవిసమ్మేళనం జరుగుతుంది. కవులకు ప్రశంసాపత్రాలతో పాటు, కవితలను సంకలనంగా ప్రచురిస్తాం.

వివరాలకు....
ఏ డా.అప్పిరెడ్డి హరినాథరెడ్డి,
రాయలసీమ సాంస్కృతిక వేదిక,
99639 17187

నాన్న 'నగ్న భారతం'

"ఎవని కంపు వాని కెంతైనా ఇంపౌను
ఎదుటి వాని కంపు ఏవగింపు
మతము గూడ పెద్ద మలినంబు కంపురా
కంపునందు చిక్కి కలత పడకు"

అచ్చ తెలుగు భాషలో అందరికీ అర్థమయ్యే రీతిలో మతమౌఢ్యాన్ని తెగేసి చెప్పిన పద్యమిది. ఒక్క మత చాంధసమే కాదు. వర్తమాన రాజకీయం, రైతు దుస్థితిని పేదకూలి దీనగాథను, వివక్షతకి గురవుతున్న స్త్రీ వేదనని, నిమ్న వర్గాలకి దూరమవుతున్న న్యాయాన్ని, మనసులు అలవర్చుకోవాల్సిన మానవీయ నీతిని పద్యాల రూపంలో తూర్పార పట్టిన పద్య కవితా కృతి "నగ్న భారతం". సమాజంలో వర్తమాన వికృతాలను నిరసిస్తూ బాధిత వర్గానికి బాసటగా నిలిచిన సాహితీ దీపికిది. 200 ఆటవెలది, సీస పద్యాల సమాహారం ఈ నగ్న భారతం. పద్య రచనే ఐనప్పటికీ ఎక్కడా సంస్కృత పద ప్రయోగాల్లేకుండా చక్కగా తేట తెలుగులో సామాన్యులకు సైతం అర్థమయ్యే రీతిలో కర్షకుడు పండించిన అక్షర సేద్యమిది.

కవి తూర్పుగోదావరి జిల్లా కడియం నివాసి చిలుకూరి వెంకట్రావు. చదువుకున్నది ఆరవ తరగతి. వృత్తి వ్యవసాయం. తన స్వీయానుభవం, సమాజంలో జరుగుతున్న అసహజ పోకడలను ఎద్దేవా చేస్తూ, వాటిని ఎండగడుతూ హలదారుడు రాసిన పద్యాల కృతిది.

వర్తమాన సమాజంలో జరుగుతున్న అఘాయిత్యాలపై అక్షర శరాలతో చేసిన యుద్ధం 'నగ్న భారతం'. కవి రాజీలేని తత్వం, ముక్కుసూటి విధానం, చెప్పదలుచుకున్నది నర్మగర్భంగా చెప్పిన తీరు అమోఘం. పండితులు గరికపాటి నరసింహారావు, ఆచార్య బేతవోలు రామబ్రహ్మం, ప్రముఖ సినీ, నాటక కళాకారుడు తనికెళ్ళ భరణి తదితరులు ఈ నగ్న భారతం పుస్తకానికి ముందుమాట చేర్చడంతో పాటు పద్యకవితా తీరుని, కవిని వేనోళ్ళ పొగిడి 'సచేల వేమన'ని బిరుదిచ్చారు. సాహిత్యమంతా అభ్యుదయ అడుగుల్లోనే నడిచినా యథార్థాలను సాంప్రదాయ కవులు సైతం శభాష్ అని కీర్తించటం మరో విశేషం. 'నగ్న భారతం' కృతి తొలి ఆవిష్కరణ 2001లో జరిగింది. 2004 మలిదశ ముద్రణలతో మరోసారి ఆవిష్కరణ జరిగింది. మానవత్వం, హేతుబద్ధం, ప్రశ్నించే తత్వం, సమానత్వం వంటి భావనలు కేవలం రచనలోనే కాకుండా, తన జీవితంలో కూడా ఆచరించి చూపిన ఆదర్శ మూర్తి చిలుకూరి వెంకట్రావు. పేదల పట్ల ప్రేమ కురిపిస్తూ, ఉన్నదాంట్లో సాయం చేస్తూ ... చివరి శ్వాస వరకూ గోచిపాత మాత్రమే ధరించిన నిడారంబరుడాయన. ఈనెల 22న ఆయన 15వ వర్ధంతి. ఈ సందర్భంగా ఆయన నగ్న భారతాన్ని ఒకసారి దర్శిద్దాం!

"రౌడీయిజం గూడా రాజకీయమునకు
మంచి వన్నె దెచ్చు మాట నిజము
గాడ్సే బతికి యున్న కాడా గవర్నరు?
విలువ లేమి గలవు వీరిలోన?"

ఇంత మృదువుగా వాయించడం వీరి బాణి. ఈనాటి రాజకీయ పరిస్థితికి ఈ పద్యం అచ్చంగా అద్దం పడుతోంది. ఈయన నాయకుల్ని నిందించడంతో ఆగలేదు. ప్రజల్ని కూడా కళ్ళు తెరవండంటూ అదే మోతాదులో హెచ్చరించారు.

"భావి నెరగవోయి భరత పుత్రుడ!
ఓట్ల నమ్ముకోకు పాట్లు పడకు
ఓట్ల పండుగలకు ఒడలెల్ల మత్తెక్క
చుక్కమందు చేత చిక్క బోకు"

రెండో ఖండిక నీతి. 'వినుడు చేయుచుంటి విన్నపములు' అనే మకుటంతో ఇందులో పద్యాలు సాగాయి. ఇందులోనీ కవి హాస్యాన్ని అంచుకుపూసిన కత్తివేట్లున్నాయి.


"ఎన్ని యున్ననేమి తిన్నది అరుగదు
కోట్లు పెరుగు కొలది కునుకు రాదు
డబ్బు పోగుసేత డాక్టర్ల కోసమే"


• • •

ఎంత జ్ఞాని అయితే నేమి? "ఎదుటనున్న వాని ఎదలోని దెరుగడు". ఇలాంటి సూక్తులు, ఉద్ధరించదగిన పంతులు.. ఈ ఖండికలో చాలా ఉన్నాయి. మానవ స్వభావాన్ని ఈయన బాగా అర్థం చేసుకున్నారు. ఆశలు ఒకదానిమీద ఒకటి ఎలా దొంతరలుగా లేస్తాయో గమనించారు.

"కూడు దొరికెనేని గూడుకై ఏడ్చును
గూడు కూడెనేని మేడ గోరు
మేడలోన కులికి మేటి పదవి గోరు"

తర్వాత ఖండికలో పేదకూలీని కవిత వస్తువు చేసి కవిత్వానికి పరిపుష్టి కలిగించాడు. ఈ ఖండికలో కవి తాలూకు ఆత్మీయత ప్రతి అక్షరంలో కనబడుతుంది. 'కూలివాని బతుకు జాలి గొలుపు' మకుటంతో శ్రమ జీవన సౌందర్యాన్ని, శ్రమజీవుల కడుపుకోతలు వర్ణన అక్షరాక్షరము కవికి ప్రతిబింబమే!





"బ్రతికినన్ని నాళ్ళు బండ చాకిరి తప్ప
కూలివాని కెపుడు కుదురు లేదు
కాటి కేగు వరకు కష్టాలు తప్పవు"

అసంఘటిత కార్మికుల వార్ధక్యం దుర్భరాన్ని ఈ పద్యంలో కవి కళ్ళకు కట్టినట్టు చెప్పారు. ముసలితనంలో రెక్కాడదు అలాగని డొక్కాగదు. ఈ కోణం పాఠకుల్ని ఆలోచింపజేస్తుంది. ఈ ఖండికలో

కార్మికులు ఎలా దోపిడీ గురవుతారో ఈ కవి గుర్తించి కుండ బద్దలు కొట్టారు.

"భరతమాత కన్న బంగారు కూలన్న!
తీర్చు చుంటి నీవు దేశ ఋణము
చేయు చుంటి నీకు జేజేలు– అందుకో
ధన్య జీవివయ్యా!– దండమిదిగో"

ఈ కవి రైతు గనకే రైతు త్యాగాన్ని ఇంతిలా వివరించ గలిగాడు. అటు పైది రైతు ఖండిక. 'అన్నదాత బతుకు మన్నుపాలు' అనేది మకుటం.

"పాడు పడిన భూమి పసిడిగా మార్చంగ
ధనలక్ష్మి కొరకు దారి చూప
రైతు వలన తప్ప రాజు చేత నగునే?"

"బ్లేడు చేయువాడే వెలకట్టు దానికి
సోడ బుడ్డి రేట్లు వాడే చెప్పు
పంట రైతుదైన పైవాడు ధర కట్టు"

"బంతి ఆట కిచ్చు బంగారు కప్పులు
బొమ్మలాట కిచ్చు సొమ్ములెన్నో
పంట పండ జేయ బహుమాన మున్నదా?" వంటి పద్యాలు రైతుల ఔన్నత్యం, కష్టాల గురించి వారి పట్ల ప్రభుత్వాల ఉదాసీన వైఖరి గురించి ఇందులో కవి చాలా ముక్కు సూటిగా చెప్పాడు. ఆటవెలది పద్యాలతో ఎంత అందంగా ఆడుకోవచ్చో యీ 'నగ్న భారతం'లో కవి వెంకట్రావు పద్యాలతో అంత సమర్థవంతంగా ఆడుకున్నారని గరికపాటి వారు ముందుమాటలో పేర్కొన్నారు.

న్యాయం మరో ఖండిక. సాధారణంగా ఎంతటి వారైనా?! న్యాయవ్యవస్థ మీద బాణాలు గురిపెట్టడానికి జంకుతారు. ఏ మూల నుంచి ఏది కోర్టు ధిక్కారమవుతుందోనని... వెంకట్రావుకేముంది? గోచిపాతరాయుడు. 'న్యాయమెచట దొరుకు నరుడ! నీకు' అనే మకుటంతో పేల్చి పడేశాడు.

"కళ్ళు లేని కోర్టు కానలేదు నిజము
చెప్పు వాని బట్టి చేయు తీర్పు
చివరికి గెలిచేది చెప్పించు కొనువాడే"

"ఉన్న దొకటే చట్టమెన్నియో కోర్టులు
తీర్పు కోర్టును బట్టి మార్పు జెందు
తప్పు జేయువాడు తప్పించుకొనుటకే"

ఇవి నేటి వాస్తవ పరిస్థితికి అద్దం పట్టే కొన్ని ఆణిముత్య పద్యాలు.

"స్త్రీని అర్ధనగ్న శృంగార మూర్తిగా
బొమ్మ వేసి సరుకులు అమ్ముకొంద్రు
బ్లేడు కట్ట పైన ఆడ బొమ్మెందుకు?
స్త్రీల గొప్పదనం తెలుసి కొనుము" అంటూ ఆడవాళ్ళని కార్పొరేట్ వ్యాపారాల్లో అర్ధ నగ్నంగా ప్రచారానికి ఉపయోగించుకుంటున్న తీరుపై కవి నిప్పులు చెరిగాడు.

"కొడుకు కొరకు తల్లి కోటి పూజలు చేయు
ఆడుబిడ్డ పుట్ట అదిరిపడు
అమ్మకైన గాని ఆడదంటే అలుసు
స్త్రీల గొప్పదనం తెలుసి కొనుము"

మహిళలకే ఆడవారి పట్ల సానుభూతి లేకపోతే ఎలా? అంటూ ఈ పద్యంలో కవి అమ్మలను నిలదీశాడు. ఆడబిడ్డలను అక్కున చేర్చుకోమని మాతృమూర్తులకు హితోపదేశం చేశాడు.

"అవనికి వెలుగు జిలుగు ఆడది
ప్రేమించు అమృత హృదయం ఆమెది
పూజించకు ఆమెను రాతి బొమ్మ వలెను
నిండు గౌరమివ్వా అనంత త్యాగనిధికి"

మహిళా మూర్తిని వంటింటి కుందేలు చేసి, రాతి బొమ్మని చేసి, పూజించుటకంటే ఆమెకు మగవారితో సమాన విలువల్ని ఇవ్వటం కంటే మించిన గౌరవం లేదంటాడు కవి. కవి చిలుకూరి చదువుకున్నది ప్రాథమిక విద్యే అయినా మానవతా విలువలు, మానవ హక్కులు, సమానత్వం తెలిసిన సమ సమాజవాది. అంతకుమించి మహిళా పక్షపాతి అందుకే మహిళాభ్యుదయానికి సంబంధించిన లోతైన విషయాలు స్పష్టంగా రాయగలిగాడు. ఈ కృతిని తన భార్య లక్ష్మికి అంకితమిచ్చారు.

"నగ్న భారతాన్ని చదివా.... లేదు, చూశా! దర్శించా.... పులకించా! కడుపు రగిలింది. గుండె మండింది. కన్ను చెమ్మగిల్లింది– చాలు! కవి ధన్యుడు. కవిత్వం సజీవం" అని పేర్కొన్నారు తనికెళ్ల భరణి. "చదవండి! రాసిన కవి కన్నా! మీరంతా చదువుకున్నవారే! కాకపోతే కాస్త ధైర్యంగా చదవండి. ఏ పద్యంలోనైనా చటుక్కున మీకు మీరు కనపడవచ్చు. కంగారు పడకండి. కలత చెందారో– మంచిదే! కవి కోరిక నెరవేరుతుంది." అని ఆచార్య బేతవోలు రామబ్రహ్మం సమీక్షలో పేర్కొన్నారు. గరికపాటి 'ఇది శతకం కాదు. అయినా శతక లక్షణాలు గల మంచి పతకం". అన్నారు.


మట్టి చేతులు సృష్టించిన గట్టి కావ్యాన్ని మనమంతా మనసు పట్టి చదువుదాం. మంచిని తట్టి చాటిన కవికి నీరాజనాలు పలుకుదాం.

(ఈనెల 22 : చిలుకూరి వెంకట్రావు 15వ వర్ధంతి)

– చిలుకూరి శ్రీనివాసరావు
89859 45506

స్మృతి కావ్యం 'విస్మృత కళింగాంధ్ర సాహితీ ప్రభ'

'గార రంగనాథం' బహుముఖ ప్రజ్ఞాశాలి. పద్యం, వచనం, విమర్శనం రాస్తారు. గత 8 ఏళ్లగా ఓ చిన్న పట్టణంలో 'రాజాం రచయితల వేదికను చక్కగా నడుపుతున్నారు. ఈ వేదిక 2022–23 వ సం:లో మూడు పుస్తకాలను వెలువరించింది. అవి 'ఆజరి, విస్మృత కళింగాంధ్ర ప్రభ, సూక్తి రత్న మంజరి. రంగనాథం ప్రతినెలా ప్రముఖ సాహితీ వేత్తలను ఆహ్వానించి, తమ వేదికపై ఉపన్యాసాలు ఇప్పిస్తున్నారు. కళింగాంధ్ర అస్తిత్వ వేదనను వివరిస్తూ పలు పత్రికలకు వ్యాసాలు రాస్తున్నారు. ఆయా వ్యాసాలలో ప్రత్యేకించి ఉత్తరాంధ్ర వెనుకబాటును ప్రస్తావిస్తున్నారు. సామాజికంగా, రాజకీయంగా ఉత్తరాంధ్రకు దక్కాల్సిన వాటా గురించి నిగదిస్తారా ఉత్తరాంధ్రులు వలసపోవడం పట్ల ఆందోళన, ఆర్ధ్రత కనిపిస్తాయి. అనేక వనరులున్న ఉత్తరాంధ్ర వెనుకబాటుకు కారకులెవరని ప్రశ్నిస్తారు. ఉత్తరాంధ్ర ప్రజలను ఏకతాటిపై ఉంచాల్సిన అవసరాన్ని వక్కాణిస్తు వివిధ రంగాల మేధావులను కూడగట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే సాహిత్య యజ్ఞం చేయడానికి పూనుకున్నారు. మరుగునపడిన సాహితీవేత్తలను ఈ 'విస్మృత కళింగాంధ్ర సాహితీ ప్రభ' పరిచయం చేస్తోంది.



ఈ పొత్తములో 30 వ్యాసాలు ఉన్నాయి. ఈ వ్యాసాలు కళింగాంధ్ర అస్తిత్వాన్ని పలికిస్తున్నాయి. కళింగాంధ్ర మూలాలను తెలియపరుస్తా. ఈ నేలపై సాగిన సాహిత్య, సాంస్కృతిక ఉద్యమాలను కళ్ళ ముందు పెంచుతాయి. వివిధ పోరాటాలను ఎరుక పరుస్తా గురజాడ, శ్రీశ్రీ, చాసో, రావిశాస్త్రి, కారా, బలివాడ, పతంజలి, భూషణం, సీరపాణి, అట్టాడ, గంటేడ, చింతకింది మొదలగు వారు ప్రామాణికమైన సాహిత్య సజన చేశారు. కానీ ఈ నేలపై పుట్టి విశేష సాహిత్య సేవ చేసిన మరికొంత మంది మరుగున పడిపోయారు. అలా మరుగున పడిన వారిని వెలికి తీసే ఈ పుస్తకం ప్రయత్నమే.

ఇందులో 'ఉత్తరాంధ్ర ప్రాచీన సాహిత్యం' అనే వ్యాసాన్ని సంపాదకులు రాశారు. ఈ ప్రాంతానికి శాతవాహనులు కంటే ప్రాచీన చరిత్ర ఉందని రుజువు చేసేది. క్రీ:పూ 192 లో యువరాజుగా ఖారవేలుడు ఉంటూ, తదనంతరం క్రీ:పూ 183 లో తొలి కళింగ చక్రవర్తిగా త్రికళింగాన్ని శ్రీముఖలింగం రాజధానిగా చేసుకొని పరిపాలించారని రచయిత సాధికారికంగా చెబుతారు. శ్రీకాకుళం జిల్లాలో గల దీర్ఘాశి శిలాశాసనంలో తేటగీతితో కూడిన సమగ్ర సీస పద్యం ఉంది. దీన్ని రాజరాజ దేవేంద్ర వర్మ మంత్రి 'బనపతి' క్రీ:శ 1077 లో రాయించాడు. ఈ సీస పద్యం నన్నయ కాలానికి చెందినదిగా ఎరుకపరుస్తూ, ఈ విధంగా ఉత్తరాంధ్ర సాహిత్యం ప్రాచీనమైనదని రచయిత రూఢి చేస్తున్నారు. 11వ శతాబ్దం నుండే సింహాచలం వైష్ణవ క్షేత్రంగా వెలుగొందింది. కష్ణమాచార్యులు 'సింహగిరి వచనాలు' రాశారు. దీన్నే తెలుగు సాహిత్యంలో తొలి వచన రచనా గ్రంథంగా పేర్కొంటారు. ఉత్తరాంధ్రలో చింతలపూడి ఎల్లన్న రాధామాధవం, తారక బ్రహ్మరాజీయం, విష్ణుమాయా విలాసం అనే గ్రంథాలు రాశారు. వీటిలో రాధామాధవాన్ని శ్రీకష్ణదేవరాయలు మెచ్చుకొని సత్కరించారు. వీరేగాక మరికొంత మంది గూర్చి ప్రస్తావన ఉంది.

'నలచరిత్ర ప్రబంధం–బెహరా రామకష్ణ కవి' గణేశ్వరరావు రాసిన వ్యాసంలో నలచరిత్ర 1444 గద్య పద్యాలతో కూడిన ఐదాశ్వాసాల కావ్యమనీ, ఈ గ్రంథం ప్రతి ఒకటి రచయిత వద్ద శిథిలావస్థలో ఉందనీ, దీన్ని ఎవరైనా పునర్ముద్రణ చేయవలసిందిగా రచయిత కోరుతున్నారు.

'విచిత్ర రామాయణం' అనే వ్యాసాన్ని రంగారావు రాశారు. కళ్లేపల్లి వెంకట నరసింహమూర్తి రాసిన ఈ రామాయణం గొప్ప కావ్యమన్నారు. ఇది 4,136 గద్య పద్యాలతో నిర్మితమైంది. ఇందు వాల్మీకి రామాయణానికి భిన్నంగా పలు కథాంశాలున్నాయి.

డా: డి.వి సూర్యారావు రాసిన 'ఉత్కళాంధ్ర సాహితీ విక్రమం' అనే వ్యాసంలో రాజా విక్రమదేవ వర్మ సాహితీ సేవను కొనియాడారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం పేరు చెప్పగానే రాజావారే తళుక్కుమని మెరుస్తారు. 1911–49 మధ్య సమకాలీన పత్రికల్లో 50 కి పైగా వీరి రచనలు ప్రచురితమయ్యాయి. వీరి కథానికలు మధునాపంతుల సత్యనారాయణ గారి 'ఆంధ్రా' పత్రికలో అచ్చయ్యాయి. వాటిలో పయనపు చెలికాడు, ముసలి మొగుడు ముఖ్యమైనవి.

గంటేడ గౌరునాయుడు 'ఒకరు కలియుగ వాల్మీకి–మరొకరు కర్షక మహర్షి' అనే వ్యాసమందించారు. ఈ వ్యాసంలో పార్వతీపురం ప్రాంతానికి చెందిన గిడిజాల లక్ష్మణ దాసు, ద్వారపు రెడ్డి అప్పలనాయుడు సాహిత్య సేవలను ప్రస్తావించారు. 'కాపువారమమ్మా/ మేము కాపువారము/ముజ్జగముల కెల్లా/పంట కాపులై కుంటలు తవ్వీ/చట్లో అంబలి చంకన పిల్లా/వెంటను మగడు ఏరు బూసుకొని/లేనిపోని యవసాయం చేసి' ఇలా సాగుతోంది లక్షణదాసు పాట. తత్వగీతాల్లో ఎక్కువ పదాలు వ్యవసాయ సంబంధమైనవి ఉండడం విశేషమంటారు గంటేడ. ద్వారపు రెడ్డి శ్రీకష్ణ ధర్మ విజయం రాశారు. ఈ గ్రంథ నామం వద్ద 'రైతులకు, ఉపాధ్యాయులకు, దేశాభిమానులకు వేదం' అనే ఉపశీర్షిక ఉంది. అంటే ఇది రైతులకు, ఉపాధ్యాయులకు ఉద్దేశింపబడిన గ్రంథమంటారు.

'అల్లంసెట్టి వారి అల్లిక జిగిబిగి' అనే వ్యాసాన్ని గార సీతారత్నం రాశారు. అల్లంశెట్టి సూర్యనారాయణ చేనేత వత్తి చేస్తూ, కవిత్వం రాయడం విశేషం. తాను రచించిన నాటకాల్లో పాత్రోచిత భాషనే వాడేవారు. రామాయణ సారస్వత దర్శనం, రసిక జన మనోభిరామ కావ్య విమర్శనం అనే విమర్శక గ్రంథాలను రాశారు.

'లఘువు అనుకున్న అలఘువు' అనే మేడూరి సత్యనారాయణ మూర్తి వ్యాసంలో గుండుగోల జగన్నాథ శాస్త్రి ఉమా కామేశ్వర శతకం, వేంకటేశ్వర శతకం, సూర్య శతకాలను పరిచయం చేశారు.

డా: అల్లంసెట్టి చంద్రశేఖరరావు రాసిన 'కళింగంలో కనకాభిషేక కవి' అనే వ్యాసంలో మాడుగుల వెంకట సూర్య ప్రసాదరావు కవి గూర్చి తెలిపారు. ఈయనవి అద్భుత రామాయణం చిత్త ప్రబోధము, సూర్య స్తవ నక్షత్రమాల, ముకుంద మాల నేడు లభ్యం. ఈయనను రచయిత గొప్ప విద్వాంసునిగా ప్రస్తుతిస్తూ, కళింగాంధ్ర కంఠాభరణం చరిత్ర పొరల్లో మగ్గిపోవడం బాధాకరమంటాడు.

'కావ్యాన్ని మెరిపించిన శీర్షిక భక్త కైకేయి' అనే వ్యాసాన్ని కోటిబాబు రాశారు. కైకేయిని స్వార్థపరురాలు అంటుంది లోకం. కానీ ఉరిటి సూర్యనారాయణ నెగెటివ్ పాత్రకు ఉదాత్తతను చేకూర్చి ప్రబంధ రచన చేయడం విశేషం.

'రామవరపు కవులు' వ్యాసంలో రామవరపు నర్సింగరావు రాసిన 'అనామధేయుడి ఆత్మకథ' అనే సీరియల్ గురించి చెప్పారు. ఇంకా 'చుట్టంచూపు, సుందరప్ప గారి విందు భోజనం' వంటి హాస్యకథలు రాసినట్లు చెప్పుకొచ్చారు.

'ఆధునిక యుగంలో మధూదయం' అనే వ్యాసంలో సుబ్బారావు, ఉప్పాడ రాజారావు గారి 'మధూదయం' అనే ప్రబంధం గురించి వివరించారు.

'కవిలో కళాకారుడు బుడితి' అనే వ్యాసంలో మానాపురం, బుడితి రామినాయుడు విశేష ప్రతిభాపాటవాలను చర్చించారు.

'బహుజన భక్తి కళారూపం భజన' ను డా: ఆల్తి మోహనరావు రాశారు. భజన విశిష్టతను, ఉత్తరాంధ్రలో భజన ప్రాధాన్యతను గూర్చి చక్కగా చెప్పారు.

'సురభిళ పద్యం–గెడ్డాపు సత్యం' లో రమణమూర్తి, సత్యం మాస్టారి సాహితీసేవను గుర్తుచేశారు.

ఈ వ్యాస సంపుటిలో బొంగు సూర్యనారాయణ, నేతేటి నరసింగరావు, యామన బసవయ్య, కణుగుల వేంకటరావు, వాండ్రంగి రామారావు, పిళ్లా చింతప్పుడు, బూరాడ గున్నేశ్వర శాస్త్రి, చిగురుకోట వేంకటరమణమూర్తి, మానాప్రగడ శేషసాయి మొదలగు వారి గూర్చి ఉంది. ఇందులో రాజాం ప్రాంత సాహిత్య చరిత్ర గూర్చి సంపాదకుడు రాసిన వ్యాసం, బరంపురం తెలుగు సాహిత్యం గురించి డా: తుర్లపాటి రాజేశ్వరి రాసిన వ్యాసం పాఠకులను అలరిస్తాయి. ఇందు ప్రాచీన, ఆధునిక సాహిత్యం మిళతమై ఉన్నది.

ప్రముఖ కవులు ఎస్.టి జ్ఞానానందకవి, వంగపండు ప్రసాదరావు, గార శ్రీరామ్మూర్తి లాంటి వారిపై కూడా వ్యాసాలు ఉన్నాయి. వీరు కనుమరుగైనవారు కాదు. కానీ ఈ గ్రంథరాజంలో నిబిడీకతం చేయడంలో సంపాదకుని ఆంతర్యం ఏమంటే, వీరు కూడా మరగునపడతారేమోనన్న భయమే కారణమనవచ్చు.

1940లో అడిదం రామారావు 'విస్మృత కళింగాంధ్ర కవులు' అనే గ్రంథాన్ని ముద్రించారు. ఇందులో ఉన్న కొట్రా, కళ్లేపల్లి కవుల చరిత్రను ఈ సాహితీ ప్రభలో కూడా పొందుపరచడం గమనార్హం. సుదీర్ఘ కాల వ్యవధిలో రంగనాథం తిరిగి కనుమరుగైన కళింగాంధ్ర కవులను తన సంపాదకత్వంలో పరామర్శించడం అభినందనీయం.

ప్రతులకు: సంపాదకులు, గార రంగనాథం,
9885758123.

పిల్లా తిరుపతిరావు
7095184846

శేషేంద్రను మనం సరిగా అర్థం చేసుకున్నామా!?



"నవల పాఠకుడి ద్వితీయ జీవితం భయంకర పాప పుణ్యాల బంధం నుంచి విముక్తి పొందిన అనుభూతి.. నవల ఒక మారి జువానా, ఒక కొకెయిన్ పొగ మేఘాలు నిండిన మేఘాల లోయ.. నవల పాఠకుల చేత అజరామరత్వం అనుభవింపచేస్తుంది. పుస్తకాన్ని రచయిత రాయడు, పుస్తకం రచయిత చేత రాయిస్తుంది" కామోత్సవ్ నవల ఆరంభంలో మనల్ని ఆహ్వానించే శేషేంద్ర పలుకులివి.

గుంటూరు శేషేంద్ర శర్మ సనాతనుల్లో సనాతనుడు, ఆధునికుల్లో ఆధునికుడు, ఒక్క మాటలో చెప్పాలంటే నవ్యాధునికుడు. పండిత సాహిత్య కారుడే కాదు. విప్లవకారుడు కూడా. కార్మికుల్లో కార్మికుడు. ఉద్యోగం తొలి రోజుల్లో శ్రీకాకుళం జిల్లా ఉద్యోగ సంఘాన్ని ఐవి. సాంబశివరావుతో కలిసి ఏర్పాటు చేశాడు. కమ్యూనిస్టుగా ముద్ర పడడంతో ఆయనను నిర్బంధ పదవీ విరమణకు గురయ్యాడు.

తెలుగు సాహిత్యంలో శ్రీశ్రీ తర్వాత అత్యంత ప్రభావ శీలురైన కవుల్లో శేషేంద్ర ఒకరు. పద్యం నుంచి గజల్ దాకా ఆయన సాగించిన ప్రస్థానం ఒక చరిత్ర. ఆయన భావుకతలో విలక్షణత ఉట్టిపడుతుంది. ఆయన కవిత్వం అజరామరం. రసాత్మకత, సామాజికత కలగలిపి ఆయన రచించిన ప్రతి కావ్యమూ మనకు అనేక కవితా దారులను తెరుస్తుంది. మే 30న 2007లో సెలవంటూ ఆయన మనల్ని శాశ్వతంగా వీడి వెళ్లిపోయాడు. ఆయన లేకున్నా ఆయన సాహిత్యం ఉంది. కవిత ఎలా ఉండాలో 1973లో ఒక కావ్యానికి రాసిన ముందుమాటలో శేషేంద్ర సూటిగా వివరిస్తాడు.

"నేను చూడగలను/ నీ నేత్రాల రేవుల్లో / నౌకల్లో తేలుతున్నాయి ! స్వప్నాలు"... భావుకతను ఇంతలా పండించిన కవి మళ్ళీ మనకి దొరుకుతాడా అనేది నన్ను నిరంతరం వేధిస్తున్న ప్రశ్న. శేషేంద్ర చేతుల్లోని వస్తువులో ప్రవాహశీలగుణం చూపించే చమత్కార గుణం అనితర సాధ్యమనే చెప్పాలి. ఎక్కడ అయితే కొత్త పదం రావాలో అక్కడ విరుద్ధమైన పదం వాడి మెరుపులు మెరిపించడంలో ఆయనకున్న ప్రజ్ఞ మనల్ని విచలితుడ్ని చేస్తుంది. పద్యం మీద ఉన్న పట్టు వల్ల వచన కళను పండించినా, దాని మీద గజల్ ఛాయలు పరిచి కలకాలం నిలబడే రస ఘోషతో మనల్ని తన్మయుల్ని చేసినా అది ఆయనకే చెల్లింది.

'ఈ నగరం జాబిల్లి" అనే గజల్ లక్ష్య లక్షణాలు వివరించిన గీతి కావ్యంలో గజల్ పట్ల తనకున్న వ్యామోహాన్ని ఒక ఆత్మకథగా చెప్పి తన కవిత్వం కొత్త దారులు పట్టడానికి గజల్ పై పట్టు తన చేత ఎన్ని అద్భుత పద్యాలు రాయించిందీ స్వయంగా కన్ఫెషన్ ఇచ్చాడు. ఇవాళ గజల్ రాసేకవులు శేషేంద్ర శర్మ యిచ్చిన ఈ సూచనలు పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

'గజల్‌కు వాస్తవంగా తెలుగులో మొలకెత్తడానికి అనుకూలమైన నేల లేదు. రాసే వాడి సంస్కారం కూడా గజల్ జన్మకు అనువైన ఊహని శబ్దాన్ని సజించగల నాజూకు సంస్కారం అయి ఉండాలి (పేజి 59 – ఈ నగరం జాబిల్లి).

గజల్ రాయటానికి ఫైజ్ వంటి కవులు ప్రోత్సాహం ఇచ్చినా, గజల్ గొంతు నలిగిపోతుందేమోనని శేషేంద్ర భయపడ్డాడు. అందుకే ఆ ప్రయత్నం విరమించాడు. బాగున్నాయనుకున్న గజల్ పంక్తుల్ని "నా దేశం నా ప్రజలు" "గొర్రిల్లా" ఆది కావ్యాల్లో వాడు కున్నాడు. ఉదా– " వేళ్ళు కాళ్ళయి నడిచే చెట్టు/ మనిషి చెట్టుగా ఉంటే ఏడాది కొక వసంతమన్నా దక్కేది, మనిషిపై అన్ని వసంతాలు కోల్పోయాను/" "నేనంతా ఒక పిడికెడు మట్టే కావచ్చు / కానీ కలమెత్తితే నాకు ఒక దేశపు జెండాకున్నంత పొగరుంది / ఇలాంటి అద్భుత కవిత్వం రాయటానికి గజల్ ఛందస్సును వాడుకొని తన ప్రసిద్ధ భావుకతను రంగరించి మనకి మంచి కవిత్వం ఇచ్చాడు శేషేంద్ర.

గజల్‌కు ప్రాణమని చెప్పిన దావా దలీల్ పద్ధతి ప్రాచీన కవిత్వంలో లోకమంతటా ఉందని శేషేంద్ర 'ఈ నగరం జాబిల్లి' పుస్తకంలో వివరించాడు. కబీరు దోహాలు, వాల్మీకి రచించిన రామాయణంలో అనుష్టుప్ ఛందంలో ఎన్నో అద్భుత శ్లోకాలను శేషేంద్ర రామాయణ రహస్యాలలో చెప్పటం జరిగింది. శేషేంద్రకు వాల్మీకి అంటే అమితమైన అభిమానం, అలాగే వేమన ఆటవెలది పద్యాలలో కూడా గజల్ యొక్క దావా, దలీల్ టెక్నిక్ వుందని శేషేంద్ర భావించాడు. మన సంస్కృతికి తగ్గ కవితా రచన ద్వారానే కవిత్వం సాధించవచ్చని శేషేంద్ర భావించి అలా నిలిచిపోయే కవితలు రాశాడు. అలాగే కవిత్వంలో లయ అవసరాన్ని శేషేంద్ర నొక్కి చెప్తాడు. అభి వ్యక్తి ప్రక్రియకి లయ, రాగం రక్త బంధువులే గాని, బయటి నుంచి వచ్చిన అతిథులు కావు అన్న శేషేంద్ర ప్రకటనలో మన కవులు నేర్చోకోతగ్గ అంశాలు చాలా ఉన్నాయి. శేషేంద్ర కవిత్వాన్ని విమర్శని అధ్యయనం చేయటం సాహిత్యానికి ఎంతో మేలు చేర్పు అవుతుంది.

(మే 30 శేషేంద్ర 16వ వర్ధంతి)

– సాగర్ శ్రీరామకవచం
98854 23934

బాతాఖానీ క్లబ్బుగా మిగిలిపోవద్దు

- ఐరాస భద్రతా మండలి విస్తరణ అవశ్యం : మోడీ

హిరోషిమా : ప్రస్తుత ప్రపంచ వాస్తవ పరిస్థితికి ప్రతిబింబించకపోతే ఐక్యరాజ్య సమితి, భద్రతా మండలి కేవలం ఒక బాతాఖానీ క్లబ్‌గా మిగిలిపోతాయని భారత ప్రధాని నరేంద్ర మోడీ వ్యాఖ్యానించారు. ఈ ప్రపంచ సంస్థల్లో సంస్కరణలు తేవాలని ఆయన పిలుపునిచ్చారు. హిరోషిమాలో జరిగిన జి-7 శిఖరాగ్ర సదస్సుకు పరిశీలక హోదాలో హాజరైన మోడీ మాట్లాడుతూ, అంతర్జాతీయ స్థాయిలో శాంతి, సుస్థిరతను కాపాడాలన్న లక్ష్యంతో ఐరాసను ఏర్పాటు చేసినప్పటికీ, అది తన బాధ్యతలను సరిగా నిర్వర్తించలేకపో తోందని ఆయన అన్నారు. శాంతి, సుస్థిరతకు సంబంధించిన అంశాలను భిన్న వేదికలపై ఎందుకు చర్చించాల్సి వస్తోంది? ఐరాస ఉన్నది ఎందుకు? శాంతి స్థాపన వందేళ్ల క్రితం ఏర్పాటు చేసుకున్న ఈ సంస్థలు 21వ శతాబ్దానికి అనుగుణంగా లేవని అన్నారు. మండలిలో పేద, వర్ధమాన దేశాల గళం వినిపించేందుకు అన్ని ఖండాలకు ప్రాతినిధ్యం ఉండాలని అన్నారు. ఐరాసలో సంస్కరణలు తీసుకురావాలని భారత్ ఎప్పటి నుంచో కోరుతోంది. భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వంపై దృష్టి పెట్టింది. ఐరాసలో ప్రస్తుతం ఐదు శాశ్వత సభ్య దేశాలు మాత్రమే ఉన్నాయి. భారత్‌తోపాటు బ్రెజిల్, దక్షిణాఫ్రికా, జర్మనీ, జపాన్ దేశాలు కూడా శాశ్వత సభ్యత్వం కోసం పోటీలో ఉన్నాయి.

ఉక్రెయిన్‌కు ఎఫ్-16 యుద్ధ విమానాలు

- రష్యా హెచ్చరిక

మాస్కో : ఉక్రెయిన్‌కు ఎఫ్-16 యుద్ధ విమానాలు అందచేయాలనే పశ్చిమ దేశాల నిర్ణయంపై రష్యా ఆగ్రహం వ్యక్తం చేసింది. ఉక్రెయిన్-రష్యా మధ్య సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేయాలనే పశ్చిమ దేశాల కుట్రను ఈ నిర్ణయం మరోసారి వెల్లడిస్తుందని రష్యా విదేశాంగ శాఖ సహాయ మంత్రి అలెగ్జాండర్ గ్రుష్కో విమర్శించారు. ఉక్రెయిన్‌కు పాశ్చాత్య దేశాల సహాయం ఎంత ఉన్నప్పటికీ, ఉక్రెయిన్‌లో సైనిక చర్యకు సంబంధించి రష్యా తన లక్ష్యాలను సాధించడానికి అవసరమైన అన్ని మార్గాలను కలిగి ఉందని గ్రుష్కో తెలిపారు. ఉక్రెయిన్‌కు ఎఫ్-16లు అందించడంపై ఇటీవల అమెరికా జాతీయ భద్రతా సలహాదారు జేక్ మాట్లాడుతూ 'ఎఫ్-16 వంటి అధునాత యుద్ధ విమానాలపై ఉక్రెయిన్ పైలట్లకు శిక్షణ ఇచ్చే ఉమ్మడి కార్యక్రమానికి వాషింగ్టన్ ఎప్పుడూ మద్దతు ఇస్తుంది' అని చెప్పారు. ఈ వ్యాఖ్యలపై రష్యా విదేశాంగ శాఖ ప్రతినిధి మరియా జఖరోవా స్పందిస్తూ అమెరికా తన సొంత లక్ష్యాలను సాధించుకోవడానికి 'నకిలీ మానవతా వాదం' ముసుగు వేసుకుందని విమర్శించారు.

బెంగళూరులో వడగండ్ల వాన బీభత్సం

- పలుచోట్ల ఈదురుగాలులతో కుంభవృష్టి
- జలదిగ్బంధనంతో విలవిల్లాడిన ప్రజలు
- కృష్ణా జిల్లాకు చెందిన మహిళ మృతి

బెంగళూరు : కర్ణాటక రాజధాని నగరమైన బెంగళూరు ఆదివారం మధ్యాహ్నం కురిసిన అకాల వర్షానికి అతలాకుతలమైంది. గాలి, వాన భీభత్సం సృష్టించాయి. కొన్ని ప్రాంతాల్లోనూ వడగండ్లతో కూడిన భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలను వర్షపు నీరు ముంచెత్తింది. రహదారులు ఈతకొలన్లను తలపించాయి. జలదిగ్బంధనంతో ప్రజలు విలవిల్లాడిపోయారు. వర్షానికి తోడు భారీగా ఈదురుగాలులు వీయడంతో పెద్ద వృక్షాలు నేలకొరిగాయి. సదాశివనగర్, కెఆర్ అండర్‌పాస్, కుమారకృప రోడ్డు, చిత్రకళా పరిషత్ వంటి ప్రాంతాల్లో వర్షపు నీరు ముంచెత్తడంతో రాకపోకలపై ఆంక్షలు విధించారు.

విహారయాత్రకు వెళ్లి..విగతజీవిగా..

కెఆర్ సర్కిల్ వద్ద ఉన్న అండర్‌పాస్‌లో వర్షపు నీటిలో ఒక కారు చిక్కుకుపోవడంతో కృష్ణా జిల్లాకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ భానురేఖ (22) చనిపోయారు. ఈ ఘటన జరిగినప్పుడు కారులో ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు ఉన్నారు. కొత్తవారు కావడంతో రోడ్డు మీద వాస్తవిక నీటి లోతును గుర్తించకుండా కారును ముందుకు పోనియ్యడంతో అండర్‌పాస్‌లో కొత్తదూరం వెళ్లాక వాహనం మునిగిపోయింది. కారులో ఉన్నవారంతా అతికష్టం మీదకు బయటకు వచ్చినా..అప్పటికే వరద నీరు ఉధృతి పెరగడంతో చిక్కుకుపోయారు. 'రక్షించండి' అంటూ హాహాకారాలు చేశారు. స్థానిక ప్రజలు చీరలు, తాళ్ళు వంటివి అందించినా వాటి ద్వారా పైకి రాలేక విలవిల్లాడిపోయారు. అగ్నిమాపక సిబ్బంది నిచ్చెన వేసి, గజ ఈతగాళ్ల సహాయంతో ఐదుగురిని రక్షించగలిగారు. అప్పటికే తీవ్ర అస్వస్థతకు గురైన భానురేఖ (22)ను ఆసుపత్రికి తరలించగా..చికిత్స పొందుతూ ఆమె చనిపోయారు. విహారయాత్రకు వెళ్లి..విగతజీవిగా మిగిలిన భానురేఖ మృతదేహాన్ని చూసినవారంతా తల్లడిల్లిపోయారు. బాధితులంతా ఏపికి చెందినవారిగా గుర్తించారు. భానురేఖ చికిత్స పొందిన ఆసుపత్రిని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సందర్శించి మృతురాలి కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం ప్రకటించారు. అకాల వర్షాలపై ఆయన ఉన్నతాధికారులతో సమీక్ష కూడా నిర్వహించారు. అత్యవసర బలగాలను రంగంలోకి దించి ప్రజలకు ఇబ్బందుల్లేకుండా చూడాలని ఆదేశించారు..



కృష్ణా జిల్లాకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ భానురేఖ కుటుంబం చిక్కుకుపోయిన కెఆర్ సర్కిల్ అండర్ పాస్ వద్ద సహాయక చర్యలు చేపడుతున్న అగ్నిమాపక సిబ్బంది

యుపిలో నర్సింగ్ సంక్షోభం

- రాష్ట్రంలో కేవలం 1.38 లక్షల మంది నర్సులు
- కొరతతో రాష్ట్ర ఆస్పత్రుల్లో ఇక్కట్లు
- శ్రద్ధ పెట్టని యోగి సర్కారు

లక్నో : బిజెపి పాలిత రాష్ట్రం యుపి నర్సుల కొరతతో ఇబ్బందులను ఎదుర్కొంటున్నది. రాష్ట్ర జనాభాకు తగిన సంఖ్యలో నర్సులు లేకపోవడంతో రోగులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. 23 కోట్ల కంటే ఎక్కువ జనాభా కలిగిన ఈ రాష్ట్రంలో కేవలం 1.38 లక్షల మంది నర్సులు, మంత్రసానులు ఉండటం గమనార్హం. ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌ఓ) ప్రమాణం ప్రకారం ప్రతి వెయ్యి మంది జనాభాకు ముగ్గురు నర్సులు ఉండాలి. అయితే యుపిలో మాత్రం ఇది 0.6 మాత్రమే కావడం ఆందోళనకరం.

రాష్ట్రంలో 27 కొత్త నర్సింగ్ కళాశాలలను నిర్మించడానికి కేంద్ర బడ్జెట్ నుంచి రాష్ట్రానికి రూ.270 కోట్లు కేటాయించింది. అయినప్పటికీ ఇందులో రెండు ప్రధాన సవాళ్లు ఉన్నాయి. ఒకటి.. శిక్షణ కోసం అధ్యాపకుల కొరత. రెండోది.. అలాంటి సంస్థల నుంచి ఉత్తీర్ణులైన విద్యార్థుల నాణ్యత. ప్రస్తుతం ప్రభుత్వ ఆధీనంలో 23 నర్సింగ్ కళాశాలలు ఉన్నాయి, వాటిలో 17.. 2021లో మాత్రమే విద్యార్థులను చేర్చుకోవడం ప్రారంభించాయి. బిఎస్సీ నర్సింగ్ డిగ్రీ అనేది నాలుగు సంవత్సరాల కోర్సు. రాష్ట్రంలోని ఆరు నర్సింగ్ కళాశాలలు (లక్నోలో రెండు, ఝాన్సీ, కాన్పూర్, మీరట్, ఇటావాలో ఒక్కొక్కటి) సంవత్సరానికి 420 గ్రాడ్యుయేట్‌లను తయారు చేస్తుంది. ఇది 2025 నుంచి 620కి పెరుగుతుందని అంచనా. కానీ గ్రాడ్యుయేట్ అయిన వారందరూ ఆరోగ్య రంగంలో ఉద్యోగాల వైపు చూడరనేది గుర్తుంచుకోవాల్సిన అంశం. నాణ్యమైన నర్సింగ్ విద్యార్థులు ప్రయివేటు, ప్రభుత్వ కళాశాలల్లో ప్రవేశం పొందేలా రాష్ట్రం నిర్ధారించాలని వైద్య రంగ నిపుణులు తెలిపారు.గతంలో ఆరోగ్య శాఖలో, నిటి ఆయోగ్‌లో సలహాదారు (ఆరోగ్యం)గా పనిచేసిన 1993-బ్యాచ్ ఐఏఎస్ అధికారి శ్రీ కుమార్ మాట్లాడుతూ.. 'మెడికల్ కాలేజీ క్యాంపస్‌లో కలిసి ఉన్న నర్సింగ్ కాలేజీలకు మౌలిక సదుపాయాలను సృష్టించాలి. 12వ తరగతి నుంచి ఎక్కువ మంది విద్యార్థులను నర్సింగ్‌లో చేరేలా చేయాలి' అని ఆయన అన్నారు. యుపిలో మాత్రం నర్సుల సంఖ్య మిగతా రాష్ట్రాలతో పోలిస్తే దారుణంగా ఉన్నది. 1,000 జనాభాకు 9 మంది నర్సులు ఉన్న కేరళ, ఆరుగురు నర్సులను కలిగి ఉన్న తమిళనాడు వంటి రాష్ట్రాల కంటే వెనుకబడి ఉంది. ఈ రాష్ట్రాల నుంచి ఉపాధ్యాయుల సహాయంతో శిక్షణ పొందిన నర్సింగ్ ఫ్యాకల్టీ కొరత పూడ్చబడుతుందని శ్రీ కుమార్ చెప్పారు. అయితే యోగి ప్రభుత్వం రాష్ట్రంలోని ఆరోగ్య వ్యవస్థపై చిన్న చూపు చూస్తున్నదని సాధారణ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

28న కొత్త పార్లమెంట్ భవనాన్ని చుట్టుముడతాం

- రైతులు, ఖాప్ నేతలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రెజ్లర్లను లైంగికంగా వేధించినందుకు బిజెపి ఎంపి, డబ్ల్యుఎఫ్‌ఐ చీఫ్ బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేయాలనే అల్టిమేటం ఆదివారం ముగియడంతో హర్యానాలోని రైతులు, ఖాప్ పంచాయతీ నేతలు మహా పంచాయితీ చేపట్టారు. 28న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రారంభించనున్న కొత్త పార్లమెంట్ భవనాన్ని వేలాది మంది మహిళలు చుట్టుముట్టి మహా పంచాయితీ నిర్వహిస్తారని నేతలు ప్రకటించారు. భవిష్యత్ ఆందోళనపై ప్రకటన కూడా ఉంటుంది. హర్యానాలోని రోహ్‌తక్‌లోని మెహమ్ నగరంలో వేలాది మంది పాల్గొనే మహా పంచాయతీని నిర్వహించారు.పార్లమెంట్ ముట్టడి నిరసనలో దేశంలోని మహిళలందరూ పాల్గొనాలని అగ్రశ్రేణి రెజ్లర్లు విజ్ఞప్తి చేశారు.

23న ఇండియా గేట్ వద్ద క్యాండిల్‌లైట్ మార్చ్‌లో పాల్గొంటామని, రెజ్లర్లు అడిగినప్పుడల్లా ఐదు గంటల్లో వేలాది మందిని జంతర్ మంతర్‌కు తీసుకువస్తామని నేతలు ప్రకటించారు. రెజ్లర్ల ఆందోళనతో మిత్రపక్షమైన జెజెపితో బిజెపి పోరు మరింత ముదిరింది. ముందుగా జెజెపి ఉప ముఖ్యమంత్రి దుష్యంత్ సింగ్ చౌతాలా ఆందోళనకు మద్దతు ప్రకటించారు. కాగా జంతర్ మంతర్‌లో 46 డిగ్రీల మండుటెండలో రెజ్లర్ల ఆందోళన కొనసాగింది. సోమవారం ఉద్యమం నెల రోజులకు చేరుకుంది.

కార్ల ఎగుమతుల్లో ప్రపంచ నెంబర్ వన్ చైనా

బీజింగ్: ప్రపంచ అగ్ర శ్రేణి కార్ల ఎగుమతిదారుగా చైనా అవతరించింది. ఇంతవరకు నెంబర్‌వన్‌గా ఉన్న జపాన్ రెండవ స్థానంలోకి నెట్టబడింది. నిక్కీ నివేదిక ప్రకారం 2023 మొదటి త్రైమాసికంలో చైనా కార్ల అమ్మకాలు 60 శాతం దాకా పెరిగాయి. చైనా ఆటోమొబైల్స్ మానుఫాక్చర్స్ అసోసియేషన్ ఇచ్చిన డేటాను ఉటంకిస్తూ నిక్కీ వార్తా సంస్థ ఈ విషయాన్ని వెల్లడించింది. గత ఏడాది ఇదేకాలంలో జరిగిన కార్ల అమ్మకాలతో పోల్చితే 58 శాతం మేర పెరిగాయి. అంటే 10.7 లక్షల కార్లను చైనా విక్రయించింది. ఈ కాలంలో జపాన్ 9.50 లక్షల కార్లు మాత్రమే విక్రయించింది. ఎలక్ట్రిక్ వాహనాలకు డిమాండ్ పెరగడం, రష్యాకు వాహనాల డెలివరీ పెరగడం వల్ల కార్ల ఎగుమతిలో జపాన్‌ను వెనక్కి నెట్టి ప్రపంచ నెంబర్ వన్‌గా చైనా అవతరించింది.

జి-7కి ఉన్న విశ్వసనీయత ఏంటి?

ప్రశ్నించిన చైనా

బీజింగ్: అమెరికా నేతృత్వంలోని జి-7 దేశాల కూటమి తన ఇష్టాన్ని ఇతరులపై రుద్దేందుకు యత్నిస్తోందని చైనా విమర్శించింది. ప్రపంచ వ్యవహారాల్లో అమెరికా నేతృత్వంలోని ఈ కూటమి పెత్తనాన్ని అంతర్జాతీయ సమాజం ఎంత మాత్రం అంగీకరించబోదని తేల్చి చెప్పింది. అది ముందుకు తెచ్చిన పాశ్చాత్య అనుకూల నియమనిబంధనలను అంగీకరించాల్సిన అగత్యం ప్రపంచానికేమీ లేదని చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ఆదివారం విడుదలజేసిన ఒక ప్రకటనలో పేర్కొంది. కొద్ది మంది ఏకపక్షంగా విధించిన నియమాలను చైనా ఎన్నటికీ అంగీకరించదు. సిద్ధాంతాలు, విలువల ఆధారంగా ప్రపంచాన్ని చీల్చడమే ఈ పాశ్చాత్య ఆధిపత్య నిబంధనల అసలు లక్ష్యమని చైనా విదేశాంగ శాఖ విమర్శించింది. కొద్ది సంఖ్యలో ఉన్న పశ్చిమ దేశాలు ఇతర దేశాల ఆంతరంగిక వ్యవహారాల్లో చీటికీ మాటికీ తలదూర్చడం, 'అమెరికా ఫస్ట్' విధానాలకనుగుణంగా ప్రపంచ వ్యవహారాలను శాసించే రోజులు పోయాయి. జి-7 అనేది అమెరికా, కెనడా, జర్మనీ, ఫ్రాన్స్, బ్రిటన్, ఇటలీ జపాన్ దేశాలతో కూడిన క్లబ్బు మాత్రమే. అంతకుమించి దీనికి ఎలాంటి ప్రాధాన్యత లేదు. ప్రపంచాన్ని రెండుగా చీల్చేందుకు జరుగుతున్న యత్నాలు ప్రమాదకరమైనవని ఐరాస మరో వైపు హెచ్చరించింది. జి-7 కూటమి శుక్రవారం విడుదలజేసిన డిక్లరేషన్‌లో చైనానుద్దేశించి టెక్నాలజీ దొంగిలించడం, ఆర్థిక నిర్బంధం, మానవ హక్కుల ఉల్లంఘన వంటి ఆరోపణలను గుప్పించింది. హాంగ్‌కాంగ్, టిబెట్, షింజియాంగ్ చైనా అంతర్గత వ్యవహారాలని వీటిలో ఇతర దేశాల జోక్యాన్ని సహించేది లేదని చైనా విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. దక్షిణ చైనా సముద్రం, తైవాన్‌కు సంబంధించి యథాతథ స్థితిని మార్చేందుకు జరిగే ఎలాంటి యత్నాన్నైనా చైనా గట్టిగా వ్యతిరేకిస్తుందని ఆ ప్రకటన పేర్కొంది. తైవాన్ వేర్పాటువాద శక్తులకు మద్దతు ఇవ్వడం ద్వారా జి-7 ఈ ప్రాంతంలో శాంతి సుస్థిరతలకు ముప్పుగా తయారైందని చైనా విమర్శించింది.

ప్రారంభించాల్సింది మోడీ కాదు.. రాష్ట్రపతి : రాహుల్

న్యూఢిల్లీ : నూతన పార్లమెంట్ భవనాన్ని రాష్ట్రపతి ప్రారంభించాలని, ప్రధానమంత్రి మోడీ కాదని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. ఈ నెల 28న పార్లమెంట్ నూతన భవనాన్ని ప్రధాని మోడీ ప్రారంభిస్తారని ప్రభుత్వం ఇటీవల అధికారికంగా ప్రకటించిన సంగతి తెలిసిందే. పార్లమెంట్ భవనాన్ని ప్రధాని ప్రారంభించడంపై ప్రతిపక్ష నేతలు ప్రశ్నిస్తున్నారు. అలాగే పార్లమెంట్ భవనాన్ని హిందూత్వ సిద్ధాంతకర్త విడి. సావర్కర్ జయంతి అయిన మే 28న ప్రారంభించడం ఏమిటని ప్రతిపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. కొత్త భవనాన్ని 'ప్రధాని వానిటీ ప్రాజెక్ట్' గా కాంగ్రెస్ అభివర్ణించింది. పార్లమెంటు భవనాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ప్రారంభించాలని, ప్రధాని కాదని రాహుల్‌గాంధీ అన్నారు. కొత్త భవనం ప్రారంభోత్సవ ప్రకటన తర్వాత, కాంగ్రెస్ అధికార ప్రతినిధి జైరాం రమేష్ భద్రతా టోపీతో ఉన్న ప్రధానమంత్రి చిత్రాన్ని పంచుకున్నారు. ఇది అతని వ్యక్తిగత ప్రాజెక్ట్ అని చిత్రాన్ని చూస్తే అర్థమౌతోందని అన్నారు.

నేటి నుంచి కాశ్మీర్‌లో జి-20 సమావేశాలు

న్యూఢిల్లీ : జమ్ముకాశ్మీర్‌లో సోమవారం నుంచి జి20 టూరిజం వర్కింగ్ గ్రూప్ సమావేశాలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. నేటి నుంచి 24 వరకు గుల్‌మార్గ్ పట్టణంలోని జి20 సదస్సు జరగనుంది. భద్రతా బలగాలు ఆ ప్రాంతాన్ని అధీనంలోకి తీసుకొని క్షణ్ణంగా తనిఖీలు నిర్విహించాయి.గుల్‌మార్గ్‌లో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు.

ఉసూరుమంటోన్న యువత

(మొదటి పేజీ తరువాయి)

విషయంలో మోడీ సర్కారు మాటలు నీటి మీద రాతలుగానే మారాయన్నారు.

ఉన్నత విద్యార్హతలున్నా..ఉపాధి కరువే..

ఇండియా స్కిల్స్ రిపోర్ట్ 2021 దేశంలో ఉన్న తిరోగమన పరిస్థితులకు అద్దం పడుతున్నది. ఈ సమాచారం ప్రకారం అధికారికంగా చదువుకున్నవారిలో, ఉద్యోగావకాశాలు 50 శాతం కంటే తక్కువగా ఉన్నాయి. బిటెక్‌లో 47 శాతం, ఎంబీఏలో 47శాతం, బిఎలో 43 శాతం, బీకామ్‌లో 40 శాతం, బిఎస్‌సి గ్రాడ్యుయేట్లలో 30 శాతం మంది మాత్రమే ఉపాధి నైపుణ్యాలను కలిగి ఉన్నారు. డిగ్రీ హోల్డర్లలో 22 శాతం మంది మాత్రమే ఉద్యోగావకాశాలు పొందుతున్నారు. ఐటీఐ గ్రాడ్యుయేట్లలో 75 శాతం మందికి ఉపాధి నైపుణ్యాలు లేకపోవటం గమనార్హం. ఫార్మా గ్రాడ్యుయేట్లలో నిరుద్యోగం 67 శాతంగా ఉన్నది. ఇతర రంగాలను కూడా కలుపుకుంటే, ప్రతి సంవత్సరం లేబర్ మార్కెట్‌లోకి ప్రవేశించే 1.5 కోట్ల మంది యువకులలో 65 శాతం నుంచి 75 శాతం వరకు నిరుద్యోగులే కావటం గమనార్హం.

కేరళలో తగ్గిన నిరుద్యోగం

తిరువనంతపురం : కేరళలో నిరుద్యోగం గణనీయంగా తగ్గింది. విజయన్ సర్కారు పనితీరుతో రాష్ట్రంలో నిరుద్యోగం 12 శాతం నుంచి 5 శాతానికి పడిపోయింది. లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డీఎఫ్) ప్రభుత్వం గత రెండేండ్లలో సాధించిన విజయాలను తెలియజేస్తూ ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ ప్రగతి నివేదికను విడుదల చేశారు. వచ్చే 25 ఏండ్లలో ప్రపంచంలోని అభివృద్ధి చెందిన దేశాల స్థాయికి కేరళలో జీవన ప్రమాణాలను పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి సూచించారు. గత ఏడేండ్లుగా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు రాష్ట్రాన్ని ఈ లక్ష్యానికి చేరువ చేస్తున్నాయని ఆయన వివరించారు.

2016లో కేరళలో ఎల్డీఎఫ్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు వివిధ పెన్షన్ పథకాల్లో రూ. 1473.67 కోట్లు బకాయిలు ఉన్నాయి. అప్పట్లో రెండేండ్లుగా పింఛను రాని వారు ఉన్నారు. విజయన్ సర్కారు పెన్షన్ మొత్తాన్ని 600 నుంచి 1600కి పెంచింది. రూ. 18997 కోట్ల మొత్తాన్ని సామాజిక పింఛన్‌గా పంపిణీ చేశారు. పేదల పట్ల నిబద్ధత కలిగిన ప్రభుత్వం కాబట్టి తమను మళ్లీ అంగీకరించారనీ, అదే ప్రభుత్వ విధానం అని సీఎం పేర్కొన్నారు.

కేరళలో పెట్టుబడులపై ఆసక్తి చూపుతూ ఇప్పుడు చాలా మంది వస్తున్నారు. వారిలో మహిళల నుంచి అధికంగా ఉండటం గమనార్హం. దాదాపు రూ. 8500 కోట్ల రూపాయల పెట్టుబడి పెట్టారు. దీని ద్వారా దాదాపు మూడు లక్షల మందికి ఉపాధి అవకాశాలు కూడా లభిస్తాయని సీఎం వివరించారు.ప్రపంచంలోనే అత్యుత్తమ బిజినెస్ ఇంక్యుబేటర్‌గా కేరళ స్టార్టప్ మిషన్ ఎంపికైందన్నారు. కేరళ సొంత ప్రాజెక్ట్ కొచ్చి వాటర్ మెట్రో, రూ.1500 కోట్ల డిజిటల్ సైన్స్ పార్క్ ప్రాజెక్ట్, వివిధ ఐటీ పార్కులు కేరళ ప్రగతికి సూచికలు. బహుళజాతి కంపెనీలు ఇక్కడికి వస్తున్నాయని సీఎం పేర్కొన్నారు.

2016కు ముందు రాష్ట్రంలో తీవ్ర నిరాశే ఉండేదని వివరించారు. "ఇక్కడ ఎలాంటి మార్పు ఉండదనీ, ఎలాంటి మార్పును ఆశించకూడదని భావించేవారు చాలా మంది ఉన్నారు. దేశానికే గర్వకారణమైన విద్య, ఆరోగ్య రంగాల వెనుకబాటుతనం, సంస్కృతిలో కుళ్లిపోవడం, అవినీతి కారణంగా ఇది జరిగింది. ఈ పరిస్థితి నుంచి నేటి కేరళ పునరుజ్జీవం పొందింది. అన్ని విపత్తులను తట్టుకుని కేరళ పురోగమిస్తున్నది. ఈ ఉద్యమాన్ని తక్కువ చేసేందుకు అసత్యాలను ప్రచారం చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి" అని విజయన్ పేర్కొన్నారు.

కేరళను మరింత ఉన్నత శిఖరాలకు తీసుకెళ్ళి నవ కేరళకు సాధ్యపడాలని కోరుకుంటున్నాననీ, ఐక్యతతోనే దీనిని సాధించగలమని వివరించారు. కేరళలో గత ఆరేండ్లలో వచ్చిన మార్పులను దాచిపెట్టి కొందరు విమర్శలు గుప్పిస్తున్నారని పేర్కొన్నారు. కేరళ ఏ రంగంలోనూ వెనుకంజ వేయలేదనీ, ఎక్కడా ఆగిపోలేదని ఆయన స్పష్టం చేశారు.



నవోదయ

మా నవోదయ విద్యాలయం
సుందర ఉద్యానవనం
ఆనందాల ధనం
విజ్ఞాన నిలయం
క్రమశిక్షణ ఆలయం
స్నేహితులతో సంబరం
కలిసిమెలిసి కదలాడే వనం
విద్యార్థుల భవితలో
వెన్నెల కురిపించే 'వెన్నెల వలస'
జవహర్ నవోదయ విద్యాలయం
మా చదువుల తల్లి....
విద్యా కుసుమాల పాలవెల్లి
ఆటపాటల వినోదం
సృజనాత్మకతకు సాన పట్టే
చక్కని విద్యా కేంద్రం
యోగాతో దినచర్య ప్రారంభం
మానసిక ఆరోగ్యానికి శ్రీకారం
ఒత్తిడి లేని విద్యా వ్యాసాంగం
ప్రతిభకు కట్టును పట్టం
నవోదయం.... నవజీవన
ఉదయం



- మొర్రి హాసిని,
10 వ తరగతి
జవహర్ నవోదయ విద్యాలయం
వెన్నెల వలస, శ్రీకాకుళం జిల్లా.



ఫ్యాషన్



- వి.మెర్లిన్ అనస్టస్
4వ తరగతి, సెయింట్ జేవియర్స్ స్కూలు
ఎల్ ఎమ్ కాంపౌండ్, ముద్దనూరు,
కడప జిల్లా.



- వి. ర్యాన్ రోస్,
2వ తరగతి,
సెయింట్ జేవియర్స్ స్కూలు,
ముద్దనూరు, కడప జిల్లా.

తెలుగు చదువుతున్నా

నా పేరు జంగు షేక్ ఇమ్రాన్. నేను సాయి వికాస్ స్కూల్లో ఏడవ తరగతి చదువుతున్నాను.

సెలవుల్లో జనవిజ్ఞాన వేదిక వారు 'పల్నాడు చిల్డ్రన్ క్లబ్' ద్వారా ఇస్తున్న శిక్షణలో చేరాను. ఈ క్లాసులు శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్నారు. పది రోజుల నుంచి క్లాసులకు వెళుతున్నా. నాకు అంతకుముందు తెలుగు చదవడం చాలా కష్టంగా ఉండేది. తప్పులు దొర్లుతాయి. కాని శిక్షణా శిబిరంలో నేర్చుకున్న దగ్గర నుంచి తెలుగు సబ్జెక్టుపై ఆసక్తి కలుగుతుంది. ఇప్పుడు పంచతంత్ర కథలు, రామాయణ మహాభారత కథలు, ప్రముఖుల జీవిత చరిత్రలు చదువుతున్నాను. చాలా బాగా అర్థమవుతున్నాయి. పుస్తకాలు ఇంకా చదవాలన్న ఆసక్తి పెరిగింది.






- జంగు షేక్ ఇమ్రాన్,
చిలకలూరిపేట, గుంటూరు జిల్లా.

బొమ్మరిల్లు








- కె అవని ,
2వ తరగతి,
ప్రొఫెసర్ ఎం. వి. ఎస్. స్కూలు,
గుంటూరు జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

---

మీ కోసం

కిటికీలకి, తలుపులకు అమర్చిన మెస్ డోర్లను బట్టలుతికే బ్రష్‌తో శుభ్రం చేసుకుంటే దుమ్ము త్వరగా వదులుతుంది.



జీవన సౌరభం

గతం నుండి నేర్చుకోవాలి. దిగులు పడకూడదు.

సాంప్రదాయ బోర్డ్ గేమ్స్


సహజంగా పార్కుకు వెళితే అక్కడ ఉయ్యాల, జారుడు బండ, బాస్కెట్‌బాల్, అవుట్‌డోర్ బౌలింగ్, ఫ్రిస్బీ.....ఇలా ఎన్నో చిన్న పిల్లలకు మాత్రమే గేమ్స్ ఆడుకునేలా ఉంటాయి. కాని బెంగుళూరులో జెపి నగర్‌లో ఓ బహిరంగ ప్రదేశంలో చిన్న, పెద్ద తేడా లేకుండా అందరూ ఆడుకునేలా బోర్డు గేమ్‌లు ఉన్నాయి. అవి మరుగున పడిపోయిన పురాతన ఆటలు కావడం విశేషం. చరిత్రను ఆధారంగా సుమారు 500 వందల బోర్డు గేమ్‌ల తయారీకి శ్రీరంజని శ్రీకారం చుట్టారు. వాటి కోసం ఆమె చేసిన కృషి, రీసెర్చ్‌కి అందరూ ప్రశంసిస్తున్నారు.

ఆటలు అంటే మానసిక, శారీరక ఆనందాన్ని ఇచ్చేవి. దాంతో మానవ సంబంధాలు మెరుగుపరుచుకోవడం కూడా చాలా ముఖ్యం. అయితే ఇప్పుడు ఆడుతున్న ఆటలంతా సాంకేతికత, ఇంటర్నెట్ ప్రపంచంలో పిల్లలు ఎక్కువ సమయం సెల్‌ఫోన్‌లతో గడుపుతున్నారు. దాంతో పిల్లలు రేడియోషన్‌కు గురై రకరకాలుగా ఇబ్బందులు పడుతున్నారు. వీటికి చెక్ పెట్టేందుకే బెంగుళూరుకు చెందిన శ్రీరంజని పురాతన కాలంనాటి ఆటలను తిరిగి జనంలోకి తీసుకువచ్చారు. ఆమె అప్లైడ్ జెనెటిక్స్‌లో మాస్టర్స్ చేశారు. ఓ రోజు శ్రీరంజని ఇంటి బయట కూర్చున్నారు. అపార్టుమెంట్లో నివాసం ఉన్న జనం సాయంత్రం వేళల్లో బయట కూర్చున్నప్పుడు చిన్నారులు, యువతీయువకులు, వృద్ధులు అంతా కలిసి సరదాగా ఆడుకోదగ్గ ఆటలు ఏమీ లేవు. ఈ నేపథ్యంలో శ్రీరంజనికి ఓ ఆలోచన కలిగింది. పాత రోజుల్లో గ్రామాల్లో అమ్మమ్మ, నానమ్మలు, తాతయ్యలు, చుట్టు పక్కల జనంతో కలిసి ఓ దగ్గర కూర్చొని పులి, మేక, అష్టాచెమ్మా, వామనగుంటలు...ఇలా రకరకాల ఆటలను ఆడుకునేవారు. అవి మనుషుల మధ్య పోటీతత్వంతో పాటు సామరస్య సంబంధాలు మెరుగుపడేలా ఉండేవి. వాటిని మళ్లీ తీసుకురావాలన్న ఉద్దేశంలో బొమ్మల తయారీదారులతో కలిసి మాట్లాడారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ యొక్క ఇండస్ట్రియల్ డిజైన్ ఫ్యాకల్టీతో కలిసి పనిచేసిన ప్రొఫెసర్ సుదర్శన్ ఖన్నాను కలిసి తమ ఆలోచన పంచుకున్నారు. శ్రీరంజని తీసుకురావాలనుకున్న బోర్డు గేమ్‌ల ఆలోచన ఆయనకు ఎంతో నచ్చింది. ఆయన ప్రోత్సాహంతో ఈ ప్రాజెక్టు తయారీకి పూనుకున్నారు.



చరిత్ర ఆధారంగా

తరాలు మారుతున్న కొద్దీ చరిత్రలో జరిగిన సంఘటనలతో పాటు ఆటలు కూడా కనుమరుగవుతున్నాయి. అవి తెలుసుకునేందుకు శ్రీరంజని రాజుల కాలంనాటి పుస్తకాలను చదివారు. ప్రాంతాలకు తగ్గట్టుగా చరిత్ర పుస్తకాలను వెతికారు. ఆ ఆటలు ఆడిన మునుపటి తరం వ్యక్తులతో కలిసి మాట్లాడారు. సాంప్రదాయ బోర్డ్ గేమ్‌ల నిధిగా ఉన్న చారిత్రాత్మక దేవాలయాలు, స్మారక చిహ్నాలను కూడా సందర్శించారు. దేవాలయాల నేలపై చెక్కబడి ఉన్న అనేక ఆటలను కూడా ఆమె కనుగొన్నారు. రాజవంశీకులు, పూజారులు, సామాన్యులు ఆడే విధంగా వినోద సాధనాలు గుళ్లపై చెక్కబడ్డాయి. బేలూరు, హళేబీడు, శ్రావణబెళగొళ, హంపి, సోమనాథపుర, చాముండి కొండ, హోయసల దేవాలయాలు తిరిగారు. బాదామి గుహలు, బనవాసి, పట్టడకల్‌లతో పాటు అర్కేశ్వర దేవాలయాల్లో పురాతన బోర్డు ఆట నమూనాలు కనుగొన్నారు. మధ్యయుగ యుగాల్లో, మొఘల్ రాజులు అనేక బోర్డ్ గేమ్‌లను ఆడేవారని తెలుసుకున్నారు. పంచ కేలియా, పచ్చిసి, దాష్ గుటి, అలిగులిమనే, పగాడేగా పిలవబడే ఆటలు చాలానే ఉండేవి. వాటిలో సుమారు 500 ఆటలను సేకరించారు శ్రీరంజని.





పర్యావరణ అనుకూలంగా


గుప్త సామ్రాజ్యంలో, అక్బర్ న్యాయస్థానం వంటి విశిష్టిత, వారి జీవిత చరిత్రలు ప్రస్ఫుటిల్లేలా చెక్క ముక్కలను తయారు చేయించారు. అందుకు హస్తకళాకారుల సహకారం తీసుకున్నారు. పర్యావరణ అనుకూల డిజైన్లు, రంగులను వాడారు. సహజసిద్ధ పదార్థాలను ఉపయోగించి చేతితో చేయబడ్డ రాతితో బోర్డులన్నీ సృష్టించారు. కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, హిమాచల్ ప్రదేశ్, ఒడిశా, ఉత్తరప్రదేశ్‌లోని 12 క్రాఫ్ట్ క్లస్టర్‌లతో కలిసి ఈ డిజైన్లు తయారు చేశారు. దీని ఫలితంగా కలంకారీ డిజైన్‌లు, గోండ్ ఆర్ట్, లంబానీ ఎంబ్రాయిడరీ, చెన్నపట్న చెక్కపని, కాన్వాస్ మెటీరియల్‌తో ఆటల నమూనాలను తయారు చేయించారు. ఆడు హులి (మేకలు, పులులు), అలిగులిమనే (ఒక మంకాల ఆట), చౌకబార (రేసు గేమ్) ఇతర ఆటలను తయారు చేయించారు. ఈ పూర్వకాలం ఆటలన్నీ సామాజిక పరస్పర చర్యలను పెంచేందుకు దోహదపడతాయి. ఏకాగ్రతను, పట్టుదలను పెంచేలా, ఆలోచన సరళి మెరుగుపడేలా, మతిమరుపు తగ్గించేలా చేస్తాయని శ్రీరంజని అంటున్నారు.

అందరూ ఆడుకునేలా

ఈ సాంప్రదాయ బోర్డు గేమ్‌లు కుటుంబంలో అందరూ ఆడుకునేలా ఇళ్ల మధ్య, బహిరంగ ప్రదేశాల్లోనూ పెట్టుకునేలా అనుకూలంగా ఉంటాయి. బెంగుళూరులో ఓ బహిరంగ ప్రదేశంలో ఈ బోర్డులను అక్కడక్కడ అవుట్‌డోర్ ఇన్‌స్టాలేషన్‌ల్లో, రాతి బెంచీలు మరియు టేబుల్‌లపై ఆటలు చెక్కబడి ఉంటాయి. ఇవి చాలా కాలం పాటు ఉంటాయి. వాటిని చుట్టుపక్కల ఎవరైనా ఆడవచ్చు. పాఠశాలలు, అపార్ట్‌మెంట్ లేఅవుట్లు, కార్యాలయాల్లో ఉంచారు శ్రీరంజని. దాంతో నగరంలో పిల్లలు, వృద్ధులు గ్రూపులుగా వస్తున్నారు. ఎంతో ఆనందంగా ఈ బోర్డుల ముందు కూర్చొని వినోదాత్మకంగా ఆడుకుని ఇళ్లకు వెళుతున్నారు. ఈ ఆటల వల్ల పాత స్నేహ పూర్వక పరిచయాలు పెరిగాయని సీనియర్స్ అభిప్రాయాలు వ్యక్త పరిచారు. పిల్లలు మాత్రం ఫోన్ ఆలోచన నుంచి బయటపడుతున్నామంటున్నారు. దాంతో ప్రతి ఒక్కరూ శ్రీరంజని చేసిన ఈ బోర్డు గేమ్‌ల ప్రయత్నాన్ని హర్షిస్తున్నారు.

పెద్ద హీరోల సందడి ఏదీ?






చిత్ర పరిశ్రమలో సినిమాలు విడుదలకు ఓ సీజన్ అంటూ ఉంటుంది. సంక్రాంతి తర్వాత సమ్మర్‌లో పెద్ద ఎత్తున సినిమాలు విడుదల చేసేందుకు దర్శకనిర్మాతలు ఆసక్తి కనబరుస్తారు. పనులు, ఉద్యోగాల రీత్యా ఒత్తిడితో ఉన్న ప్రేక్షకులు కుటుంబంతో కలిసి సినిమాలు చూడాలనుకుంటారు. యువత అయితే పరీక్షలు పాస్ అయితే స్నేహితులతో కలిసి సినిమాకు వెళతారు. మరీ ఇంత డిమాండ్ ఉన్న ఈ సమ్మర్‌లో చెప్పుకోదగ్గ సినిమాలు గానీ, పెద్ద హీరో చిత్రాలు గానీ ఏమీ విడుదల కాలేదు.

సమంత శాకుంతలం, నరేష్ 'ఉగ్రం, గోపించంద్ రామబాణం, నాగచైతన్య 'కస్టడీ' సంతోష్ శోభన్ 'అన్ని మంచి శకునములే' సినిమాలు విడుదల అయ్యాయి. కానీ ఆశించిన స్థాయిలో సినిమాలు అభిమానులను ఆకట్టుకోలేకపోయాయి. కోట్లు ఖర్చు పెట్టి ప్రమోషన్లు చేశారు. కాని ఎదురుచూసినంతగా వినోదాన్ని పంచలేకపోయాయి. దాంతో ఈ సమ్మర్‌లో మంచి సినిమాలు విడుదల కాలేదని ప్రేక్షకులు అసహనం వ్యక్త పరుస్తున్నారు. కనీసం షూటింగ్ పూర్తి చేసుకున్న పెద్ద హీరోల సినిమాలు సైతం విడుదలకు నోచుకోలేదని నిరాశ పడుతున్నారు. తమిళ నటుడు విజయ్ ఆంటోనీ నటించిన 'బిచ్చగాడు-2' తెలుగులో విజయం సాధించింది. ఈ చిత్రం చెల్లి సెంటిమెంట్ చుట్టూ తిరుగుతుంది. కథ పరంగా ప్రభావవంతంగా హత్తుకునేలా చూపించారు. దీంతో థియేటర్స్ దగ్గర సమ్మర్ సందడి నెలకొంది. ఇలాంటి టైమ్‌లో కేరళ వరదల నేపథ్యంలో వచ్చిన ఆసక్తికరమైన సినిమా '2018'. మలయాళం వందకోట్లకు పైగా రాబట్టడంతో ఈ సినిమాను నిర్మాత బన్నీ వాస్ తెలుగులో డబ్ చేయించారు. ఈ నెల 26న విడుదల కానుంది. నరేష్-పవిత్రల సినిమా 'మళ్లీ పెళ్లి'. విడుదలకు సిద్ధమయ్యింది. కానీ బయ్యర్లు కొనుగోలు చేసేందుకు ముందుకు రావడం లేదని టాక్. వీటి మధ్యలో మొత్తం కొత్త వ్యక్తులతో తీసిన చిత్రం 'మేము ఫేమస్'. గ్రామంలో పనిపాట లేకుండా తిరిగే యువత తలచుకుంటే ఏదైనా సాధిస్తారన్న అంశంతో తీస్తున్న ఈ చిత్రం కూడా ఈ నెల్లో విడుదల అవుతుంది.







ఓటీటీల్లోనూ...

థియేటర్స్‌లో విడుదలైన సినిమాలు ఆశించిన మేరకు వినోదం పంచకపోవడంతో అవి వారం రోజుల తర్వాత ఓటీటీలో వచ్చేస్తున్నాయి. ఏజెంట్, విరూపాక్ష, శాకుంతలం, రామబాణం వరుసగా ఓటీటీల్లో వచ్చేసాయి. అంతేకాకుండా కొత్త వెబ్‌సిరీస్‌లు స్ట్రీమింగ్ అవుతున్నాయి. మెగా కుటుంబం నుంచి నటిగా వచ్చిన వారిలో నిహారిక వెబ్‌సిరీస్‌తో ఓటీటీలోకి వచ్చేసింది. ఆమె కీలక పాత్రలో 'డెడ్ పిక్సెల్స్' నటించారు. ఆదిత్య మండల దర్శకత్వం వహిస్తున్న ఈ సిరీస్ ఓటీటీ 'డిస్నీ హాట్‌స్టార్'లో 19న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. వీడియో గేమ్‌లకు యువత ఎంతగా ప్రభావితమవుతుందో ఈ సిరీస్‌లో చూపించారు.

అసలు ఎప్రిల్ నెలలోనే మెగాస్టార్ చిరంజీవి 'భోళా శంకర్' షూటింగ్ చివరి దశలో ఉంది. పవన్ కళ్యాణ్ 'హరిహర వీరమల్లు' షూటింగ్ చాన్నాళ్ల కిందట మొదలైంది. కానీ ఓజీ, అటు ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాలు సెట్స్ పై ఉన్న ఆసక్తి ఈ సినిమాపై చూపించడం లేదని ఆయన కాల్‌షీట్స్ చూస్తే తెలుస్తోంది. దీంతో పాటు పవన్‌కళ్యాణ్, సాయి ధరమ్ తేజ్ కలిసి నటించిన 'బ్రో' చిత్ర షూటింగ్ చివరి దశలో ఉంది. ఇవన్నీ రీమేక్ సినిమాలే అయినా మేకర్స్ మాత్రం సమ్మర్‌లో విడుదల చేసేందుకు సిద్ధంగా లేరు. ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న వాటిలో మహేష్‌బాబు సినిమా ఒకటి. కానీ అటు సంక్రాంతిగానీ, ఇటు సమ్మర్‌లో గానీ ఓ సినిమా రిలీజ్ చేసేలా ప్లాన్ చేసుకోలేదు. మహేష్ బాబు-త్రివిక్రమ్ కాంబినేషన్‌లో యాక్షన్ రొమాంటిక్ ఎంటర్టైనర్ చిత్రం ప్రకటించినప్పటి నుంచీ ట్రైలర్, ఫస్ట్‌లుక్ కోసం ఫ్యాన్స్ ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు. కానీ షూటింగ్ సగం కూడా ముందుకు వెళ్లలేదు. ఇటు రామ్‌చరణ్ - దర్శకుడు శంకర్ కాంబోలో వచ్చిన ' గేమ్ ఛేంజర్' షూటింగ్ పూర్తి అయ్యింది. కానీ పోస్ట్‌ప్రొడక్షన్లు ఉన్నాయంటూ విడుదలలో ఆలస్యం చేస్తున్నారు. ఆర్‌ఆర్‌ఆర్ వల్ల సినిమాలు ఆలస్యం అయినా ఎన్టీఆర్- కొరటాల శివ దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నారు. దాంతో ఈ ఏడాది ఆయన సినిమాలు విడుదల అవుతాయా? లేదా అన్నది డౌటే. నాగార్జున ఘోస్ట్ సినిమా తర్వాత సుదీర్ఘ విశ్రాంతి తీసుకున్నారు. మరో కొత్త సినిమాకి కనీసం ఓకే కూడా చెప్పలేదు. దాంతో ఈ ఏడాది ఎండలు ఉన్నంత వేడిగా థియేటర్స్‌లో తెలుగు హీరోలు చిత్రాలు విడుదల చేయలేదు.

ప్లే ఆఫ్‌లోకి ముంబయి

గ్రీన్ సెంచరీతో హైదరాబాద్‌పై గెలుపు
ఓటమితో సన్‌రైజర్స్ నిష్క్రమణ



కామెరూన్ గ్రీన్ 100*
(47 బంతుల్లో 8 ఫోర్లు, 8 సిక్స్‌లు)

201 పరుగుల లక్ష్యాన్ని ముంబయి ఇండియన్స్ ఊదేసింది. కామెరూన్ గ్రీన్ (100 నాటౌట్) అజేయ సెంచరీతో చెలరేగాడు. కెప్టెన్ రోహిత్ శర్మ (56) అర్ధ సెంచరీతో కదం తొక్కాడు. కామెరూన్, రోహిత్ మెరుపులతో సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై ముంబయి ఇండియన్స్ 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ విజయంతో మొత్తం 16 పాయింట్లతో ముంబయి ప్లే ఆఫ్‌కి చెరుకుంది.

ముంబయి : కామెరూన్ గ్రీన్ (100 నాటౌట్, 47 బంతుల్లో 8 ఫోర్లు, 8 సిక్స్‌లు) ఖతర్నాక్ ఇన్నింగ్స్‌తో కదం తొక్కాడు. 47 బంతుల్లోనే సెంచరీ సాధించిన కామెరూన్ గ్రీన్ చావోరేవో తేల్చుకోవాల్సిన మ్యాచ్‌లో ముంబయి ఇండియన్స్‌కు ఎదురులేని విజయాన్ని అందించాడు. కెప్టెన్ రోహిత్ శర్మ (56, 37 బంతుల్లో 8 ఫోర్లు, 1 సిక్స్) సైతం రాణించటంతో 201 పరుగుల లక్ష్యాన్ని ముంబయి ఇండియన్స్ 18 ఓవర్లలోనే ఛేదించింది. మరో 12 బంతులు మిగిలి ఉండగానే 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్ హైదరాబాద్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 200 పరుగులు చేసింది. ఓపెనర్లు మయాంక్ అగర్వాల్ (83, 46 బంతుల్లో 8 ఫోర్లు, 4 సిక్స్‌లు), వివ్రాంత్ శర్మ (69, 47 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ సెంచరీలతో రాణించారు. ఓపెనర్ల మెరుపులతో సన్‌రైజర్స్ హైదరాబాద్ భారీ స్కోరు సాధించింది. ఛేదనలో శతక హీరో కామెరూన్ గ్రీన్ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకున్నాడు. ఈ విజయంతో 16 పాయింట్లు సాధించిన ముంబయి ఇండియన్స్ ప్లే ఆఫ్స్‌లో చోటు సాధించింది. ఈనెల 24న ఎలిమినేటర్ మ్యాచ్‌లో లక్నోతో తలపడనుంది.

గ్రీన్ దంచికొట్టగా.. : ఛేదనలో ఓపెనర్ ఇషాన్ కిషన్ (14) ఆరంభంలోనే వికెట్ కోల్పోయాడు. కెప్టెన్ రోహిత్ శర్మ (56)తో జతకట్టిన కామెరూన్ గ్రీన్ (100 నాటౌట్) మ్యాచ్‌ను ముంబయి చేతుల్లోకి తీసుకున్నాడు. పవర్‌ప్లేలో ముంబయి 60 పరుగులు పిండుకోగా.. కామెరూన్ గ్రీన్ వచ్చీ రాగానే బౌండరీలపై విరుచుకుపడ్డాడు. ఐదు సిక్సర్లు, నాలుగు ఫోర్లతో 20 బంతుల్లోనే అర్ధ సెంచరీ సాధించిన గ్రీన్.. ఛేదనను సులభతరం చేశాడు. మరో ఎండ్‌లో రోహిత్ శర్మ ఏడు ఫోర్లు, ఓ సిక్సర్‌తో 31 బంతుల్లో అర్ధ శతకం బాదాడు. రోహిత్, గ్రీన్ జోడి రెండో వికెట్‌కు ఏకంగా 128 పరుగుల భారీ భాగస్వామ్యం నమోదు చేసింది. కామెరూన్ దూకుడుగా విరుచుకుపడ్డాడు. సిక్సర్లు, ఫోర్ల రూపంలోనే 80 పరుగులు పిండుకున్న కామెరూన్ గ్రీన్.. సన్‌రైజర్స్ బౌలర్లను ఊచకోత కోశాడు. రోహిత్ నిష్క్రమించినా.. సూర్యకుమార్ యాదవ్ (25 నాటౌట్, 16 బంతుల్లో 4 ఫోర్లు) తోడుగా మరో 12 బంతులు ఉండగానే లాంఛనం ముగించాడు. సన్‌రైజర్స్ బౌలర్లలో భువనేశ్వర్, మయాంక్ డాగర్ చెరో వికెట్ తీసుకున్నారు. యువ పేసర్లు కార్తీక్ త్యాగి, ఉమ్రాన్ మాలిక్ భారీగా పరుగులు ఇచ్చారు. సీజన్లో తొలిసారి సన్‌రైజర్స్‌కు అదిరే ఆరంభం లభించింది. ఆరంగేట్ర ఓపెనర్ విశ్రాంత్ శర్మ (69), మయాంక్ అగర్వాల్ (83) తొలి వికెట్‌కు 140 పరుగుల భారీ భాగస్వామ్యం నమోదు చేశారు. పవర్‌ప్లేలో 53 పరుగులు సాధించిన ఓపెనర్లు.. మిడిల్ ఓవర్లలో 104 పరుగులు జోడించారు. దీంతో హైదరాబాద్ భారీ స్కోరుకు గట్టి పునాది వేసుకుంది. వివ్రాంత్ ఏడు ఫోర్లు, ఓ సిక్సర్‌తో 36 బంతుల్లో అర్ధ సెంచరీ సాధించగా.. మయాంక్ అగర్వాల్ సైతం ఏడు ఫోర్లు, ఓ సిక్సర్‌తో 32 బంతుల్లో ఆ ఫిఫ్టీ చేశాడు. ఓపెనర్ల నిష్క్రమణతో సన్‌రైజర్స్ ఇన్నింగ్స్ మందగించింది. క్లాసెన్ (18), ఫిలిప్స్ (1), బ్రూక్ (0) నిరాశపరిచారు. చివరి బంతికి సిక్సర్ బాదిన మార్క్‌రామ్ (13 నాటౌట్) జట్టు స్కోరు 200 చేశాడు. ముంబయి బౌలర్లలో ఆకాశ్ (4/37) నాలుగు వికెట్ల ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు.

సంగీత దర్శకుడు రాజ్ ఇకలేరు



హైదరాబాద్ : సంగీత దర్శకుడు కోటితో కలిసి ఎన్నో విజయవంతమైన చిత్రాలకు స్వరాలు సమకూర్చిన మ్యూజిక్ డైరెక్టర్ రాజ్ ఆదివారం కన్నుమూశారు. రాజ్-కోటి సంగీత ద్వయంలో రాజ్ (68) గుండెపోటుతో హైదరాబాద్‌లోని తన నివాసంలో తుదిశ్వాస విడిచారు. రాజ్ అసలు పేరు తోటకూర సోమరాజు. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. సంగీత ప్రపంచంలో రాజ్, కోటి కలిసి రాజ్-కోటిగా ప్రఖ్యాతిగాంచారు. దశాబ్దాలపాటు వీరిద్దరూ సినీప్రియులను తమ సంగీతంతో అలరించారు. రాజ్ మరణంతో చిత్రపరిశ్రమలో విషాద ఛాయలు అలుముకున్నాయి. పలువురు సినీ ప్రముఖులు సామాజిక మాధ్యమాల వేదికగా సంతాపం ప్రకటించారు. రాజ్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. రాజ్-కోటి దాదాపు 150కు పైగా చిత్రాలకు పనిచేశారు. 'ముఠామేస్త్రి', 'బావా బావమరిది', 'గోవిందా గోవిందా' 'హలోబ్రదర్' వంటి చిత్రాలు వీరికి మంచి పేరు తెచ్చిపెట్టాయి. అనుకోని కారణాల వల్ల కోటి నుంచి విడిపోయిన రాజ్ సొంతంగా కొన్ని చిత్రాలకు సంగీతం అందించారు. 'సిసింద్రీ', 'రాముడొచ్చాడు', 'ప్రేమంటే ఇదేరా' (నేపథ్య సంగీతం) తదితర సినిమాలకు సంగీత దర్శకుడిగా పనిచేశారు. కొన్ని సినిమాల్లో ఆయన అతిథి పాత్రల్లోనూ కనిపించారు. రాజ్ తండ్రి తోటకూర వెంకట రాజు కూడా సంగీత దర్శకులు. పలు తెలుగు చిత్రాలకు పనిచేశారు.

బెంగళూరు ఆశలకు 'శుభం'

వృథాగా మారిన కోహ్లి రికార్డు శతకం

బెంగళూరు : చివరి లీగ్ మ్యాచ్‌లో గెలిచి ఐపిఎల్ 2023లో ప్లేఆఫ్‌కు చేరాలన్న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఆశలు తీరలేదు. ఆదివారం జరిగిన చివరి మ్యాచ్‌లో బెంగళూరుపై గుజరాత్ టైటాన్స్ ఇంకా ఐదు బంతులు మిగిలి ఉండగానే, ఆరు వికెట్లతో విజయం సాధించింది. బెంగళూరు విధించిన 198 లక్ష్య ఛేధనలో గుజరాత్ ఆటగాడు శుభమన్ గిల్ శతకంతో అద్భుతంగా రాణించాడు. 52 బంతుల్లో 104 పరుగులతో (8 సిక్స్‌లు, ఐదు ఫోర్లు)అజేయంగా నిలిచాడు. బెంగుళూరు పరాజయంలో కీలక పాత్ర పోషించాడు. గుజరాత్ జట్టులో విజయ్ శంకర్ అర్ధ సెంచరీ (53 పరుగులు, 53 బంతుల్లో రెండు సిక్స్‌లు, ఏడు ఫోర్లు)తో రాణించాడు. గుజరాత్ ఓపెనర్ వృద్ధిమాన్ సాహా (12) విఫలమైన వేళ శుభమన్ గిల్- విజయ్ శంకర్ జోడీ రెండో వికెట్‌కు 124 పరుగులు జోడించి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించింది. విజయ్ శంకర్, తరువాత డసున్ శనక (0), డేవిడ్ మిల్లర్ (6), త్వరగా అవుటైనా, రాహుల్ తేవటాయి (4)తో కలిసి గుజరాత్‌కు శుభమన్ గిల్ విజయాన్ని అందించాడు. ఈ మ్యాచ్‌లో ముందుగా టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరులో విరాట్ కోహ్లి (101) పరుగులతో బెంగళూరు 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 197 పరుగులు చేసింది. ఈ శతకంతో ఐపిఎల్‌లో అత్యధిక శతకాలు (7) చేసిన ఆటగాడిగా కోహ్లి రికార్డు నెలకొల్పాడు. బెంగళూరు పరాజయంతో ముంబయి నేరుగా 16 పాయింట్లతో ప్లేఆఫ్‌కు చేరుకుంది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68